


# విజయభాను




విశాఖపట్నం, శుక్రవారం 01-02-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 122 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## 2, 3, 4 తేదీలలో
# పింఛన్ల పండగ



**ఎన్నికల్లోపే నిరుద్యోగ భృతిపెంచుతా**

**ఢిల్లీ దీక్షకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రావాలి**

**టీడీఎల్పీ సమావేశంలో తెదేపా అధినేత నిర్ణయం**

అమరావతి: టీడీఎల్పీ సమావేశంలో మరో రెండు కీలక నిర్ణయాలు తీసుకునే ఆలోచనలో చంద్రబాబు. ఎన్నికల్లోపే ఆ రెండు నిర్ణయాలను అమలు చేయాలని భావిస్తున్న ఏపీ ముఖ్యమంత్రి. నిరుద్యోగులకు, రైతులకు శుభవార్తేనంటున్న టీడీపీ నేతలు. నిరుద్యోగ భృతి రూ.1000 నుంచి రూ.2వేలకు పెంచే ఆలోచన

*ఎన్నికల్లోపే నిరుద్యోగ భృతిని పెంచాలి*
*రైతులకు, కౌలు రైతులకు*
*మేలు చేసే విధంగా పథకాలపై ఆలోచన*

ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో దూకుడు పెంచారు చంద్రబాబు. పింఛన్ల రెట్టింపు.. డ్వాక్రా తరువాయి 2లో..

## అమరావతిలో తిరుపతి



తిరుపతి ఆలయ నిర్మాణ భూమి పూజకు వెళుతున్న సీఎం చంద్రబాబు నాయుడు, టీటీడీ సిబ్బంది ←

నమూనా ఆలయాన్ని పరిశీలిస్తున్న దృశ్యం →



# రహదారి భద్రత ట్రాఫిక్ పోలీసుల బాధ్యత

- అన్ని పాఠశాలలలో రహదారి భద్రతపై అవగాహన కల్పించాలి
- రోడ్డు ప్రమాదాల కారణాలను తెలుసుకొనేందుకు ప్రత్యేక సబ్ కమిటీ
- విశాఖ జిల్లా కలక్టర్ భాస్కర్



విశాఖపట్నం: జిల్లాలోని రోడ్లన్నీ భద్రతా రహదారులుగా తీర్చిదిద్దాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ కె.భాస్కర్ ఆదేశించారు. గురువారం ఉదయం కలక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన రహదారి భద్రత కమిటీ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రత అనేది ఎంతో ప్రధాన మైనదని, దానికి ముఖ్యంగా ట్రాఫిక్ పోలీసుల బాధ్యత ఎక్కువగా వున్నదని వారు ఎప్పటికప్పుడు రోడ్ల పరిస్థితులను పరిశీలించి బ్లాక్ స్పాట్స్, గతుకులు, తదితరాలను ఫొటోలు, జియోటాగ్ చేసి ఇంజనీరింగ్ శాఖకు తెలియ జేయాల్సి ఉంటుందన్నారు. జాతీయ రహదారులలో సైనేజ్ బోర్డులు, ట్రాఫిక్ సిగ్నల్స్, స్పీడ్ బ్రేకర్లు, రేడియం స్టిక్కర్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో నాలుగు చక్రాల వాహనాలు ఎన్ని తిరుగుతున్నాయి, వాటి వివరాలను తెలియజేయాలన్నారు. వీటికి సంబంధించి పోలీసు, జీవియంసి, రవాణా అధికారుల బృందంగా ఏర్పడి జాయింట్ ఇన్స్పెక్షన్ చేయాలన్నారు.

వియంఆర్డిఎ ఆర్.టి.సి. కాంప్లెక్స్ వద్ద నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌కు ఎటువంటి వాహన పార్కింగ్ లేకుండా, మరియు జివియంసి అనుమతులను కూడా పొందకుండా నిర్మించారని జివియంసి కమిషనర్ కలెక్టర్‌కు తెలుపగా అందుకు కలక్టర్ స్పందిస్తూ ఏమైనా నిర్మాణాలను చేపట్టేటప్పుడు నిబంధనలను పాటిస్తూ తరువాయి 2లో..

## భవనం పైనుంచి పడి ఐదుగురు కూలీల దుర్మరణం

### భద్రతా ప్రమాణాల లోపమే కారణం

కీసర: మేడ్చల్ జిల్లా కీసర మండలం రాంపల్లి వద్ద రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ పనుల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. వీటి నిర్మాణ పనులు చేస్తున్న ఆరుగురు కూలీలు ప్రమాదవశాత్తు పదో అంతస్తు నుంచి జారిపడ్డారు. ఈ ఘటనలో నలుగురు అక్కడకక్కడే మరణించగా మరొకరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన యెషు కుమార్ చౌదరి(20), సుపాల్‌రాయ్(32), సైపుల్ హక్(26), అభిజిత్‌రాయ్(18), ఇలాన్ షేక్(20) ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందగా.. విప్లవ్‌రాయ్ అనే వ్యక్తికి తీవ్రంగా గాయాలవడంతో గాంధీ ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించాడు. వీరంతా ఒకే ప్రాంతానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. కీసర పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

*తోటి కూలీల ఆందోళన..*

తోటి కూలీలు మృతి చెందడంతో తరువాయి 2లో..

# ఉప ఎన్నికలో 'చెయ్యి' జోరు

## రాజస్థాన్‌లో కాంగ్రెస్ జయభేరి



జైపూర్: రాజస్థాన్‌లో అధికార కాంగ్రెస్ పార్టీ మరోసారి జయభేరి మోగించింది. రామ్‌గఢ్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి షఫియా జుబేర్ 12 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. జుబేర్‌కు 83,311 ఓట్లు రాగా.. సమీప భాజపా అభ్యర్థి సువంత్ సింగ్‌కు 71,083 ఓట్లు వచ్చాయి. ఈ విజయంతో 200 శాసనసభ స్థానాలున్న రాజస్థాన్ అసెంబ్లీలో కాంగ్రెస్ సంఖ్యాబలం 100కు పెరిగింది.

గతేడాది డిసెంబరు 7న రాజస్థాన్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అయితే అప్పుడు రామ్‌గఢ్‌లో బీఎస్పీ అభ్యర్థి మృతితో ఆ నియోజకవర్గంలో ఎన్నిక వాయిదా వేసి తిరిగి జనవరి 27న ఎన్నికలు నిర్వహించారు. గురువారం ఓట్ల లెక్కింపు చేపట్టగా కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 99 సీట్లు సాధించింది. భాజపాకు 73 సీట్లు వచ్చాయి. అయితే ఒక స్థానంలో గెలిచిన ఆర్ఎల్‌డీ మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది.

*జింద్‌లో భాజపా ముందంజ..*

ఇక హరియాణాలోని జింద్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో భాజపా ముందంజలో ఉంది. జింద్ సిట్టింగ్ ఎమ్మెల్యే హరి చంద్ మిద్దా మృతితో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో ఈ నెల 27న ఎన్నికలు తరువాయి 2లో..

## కేంద్రంలో హంగ్ ఏర్పడితేనే మేలు



హైదరాబాద్: లోటస్ పాండ్‌లోని వైకాపా కార్యాలయంలో తటస్థులు, మేధావులు, ఇతర వర్గాలతో వైకాపా అధినేత జగన్ భేటీ అయ్యారు. ఆయా వర్గాల నుంచి సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... చట్ట ప్రకారం విశాఖకు రైల్వేజోన్ రావాలి. తరువాయి 2లో..

## ఏసీబీ వలలో మరో ప్రభుత్వాధికారి



విశాఖపట్నం: ఏసీబీ వలలో మరో ప్రభుత్వాధికారి చిక్కాడు. మైన్స్ అండ్ ఆర్కియాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ శివాజీ ఇళ్లలో గురువారం ఏసీబీ సోదాలు చేపట్టింది. ఎంవీపీ కాలనీలోని శివాజీ ఇల్లు, కార్యాలయాల్లో ఏసీబీ తనిఖీలు నిర్వహించింది. విశాఖ, విజయనగరం జిల్లాల్లో మొత్తం 6 చోట్ల సోదాలు జరుగుతున్నాయి.




## వైఎస్సార్‌సీపీలోకి మేడా మల్లికార్జునరెడ్డి



హైదరాబాద్: తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, రాజంపేట శాసన సభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీలోకి వచ్చారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో కొందరు నేతల దుశ్చర్యలు చూడలేకపోయానని, తనను అన్యాయంగా పార్టీ నుంచి సస్పెండ్ తరువాయి 2లో..



# ఘనంగా ముగిసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన



జూబ్లీ హై స్కూల్ (సెంట్ మేరీస్ బిఈడి కాలేజ్) జ్ఞానాపురం, విశాఖపట్నం నందు మూడు రోజులపాటు నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్ స్పైర్ మానక్ విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ముగిసింది. మూడురోజులపాటు సాగిన ఈ ప్రదర్శనను మానవ వనరుల శాఖామాత్యులు శ్రీ గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు.

ముగింపు సమావేశమునకు ముఖ్యఅతిధిగా పాల్గొన్న సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు అధికారి వి.సన్యాసిరావు మాట్లాడుతూ పోటీలో గెలుపొందడం కన్నా పాల్గొనడాన్ని ప్రాధాన్యత తీసుకోవడం ద్వారా భవిష్యత్ లో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, శాస్త్రీయ దృక్పధాన్ని విద్యార్థలలలో ఉపాధ్యాయులు పెంపొందించడం ద్వారా సృజనాత్మకతను రూపొదిద్ద గలలమని ఉపాధ్యాయులకు సూచించారు.

ఈ ప్రదర్శన ముగింపు సమావేశములో సభ్యాధ్యక్షులు జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ నిశితమైన పరిశీలన, పరిశోధన, వినూత్నంగా ఆలోచించే విద్యార్థులు భావి భారత శాస్త్రవేత్తలుగా తయారుకాగలరని, అటువంటి ఆలోచనా ధోరణిగల విద్యార్థులకు ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శనలు మార్గదర్శకం చేస్తాయని, అందుకే విద్యార్థులు ఇటువంటి ప్రదర్శనలో తప్పక పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు.

ఈ ముగింపు సమావేశములో జూబ్లీ ఇంగ్లీషుమీడియం పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ రత్నకుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మంజులా, సెయింట్ మేరీస్ డి.ఎడ్., కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ ఫాదర్ రాజ్ కుమార్, సెయింట్ మేరీస్ బి.ఎడ్., కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసరావు, విశాఖపట్నం ఉప విద్యాశాఖాధికారి ఎన్ ప్రేమ్ కుమార్, పరిషత్ ఉప విద్యాశాఖాధికారి వి. సునీత మరియు విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల సైన్సు అధికారులు కె.ప్రసాద్, కె. సుబ్రహ్మణ్యం, బి.కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.



**గుంటూరు రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర తెలుగుయువత కార్యవర్గ సమవేశములో నూతనము గా నియమించబడిన రాష్ట్ర తెలుగు యువత అద్యక్షులు దేవినేని అవినాష్ కు శుభాకాంక్షలు తెలుపుతు సమవేశములో మాట్లాడిన జిల్లా తెలుగు యువత అద్యక్షులు కర్రోతు వెంకట నరసింగరావు**

## మాకు కౌంటర్ సిగ్నేచరా? అవసరం లేదు: ఏపిటిఫ్

విజయనగరం: జిల్లా పరిషత్, ప్రభుత్వ, మున్సిపల్, కెజిబివి, ప్రభుత్వ కళాశాల ప్రధానోపాధ్యాలు , ఉపాధ్యాయులకు ఎంఎల్సొ ఓట్ల నమోదు దరఖాస్తులపై ఉన్నతాధికారుల కౌంటర్ సిగ్నేచర్ అవసరం లేదని ఏ.పి.టి.ఎఫ్. బంకురు జోగి నాయుడు స్పష్టం చేశారు.

# పింఛన్లు మంజూరు



అనంతగిరి : మండలంలోని వేంగడ పంచాయతీ వేంగడ గ్రామంలోని తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో వృద్ధాప్య పెన్షన్లు పెంపు గురించి కార్యక్రమంనకు ముఖ్య అతిథిగా పాల్గొన్న వైస్ చైర్మన్ కొట్యాడ అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు కోసం పింఛన్, మహిళలకు అవగాహన కల్పించనున్నారు

అధేవిధంగా వేంగాడ గ్రామాపంచాయితీలో సుమారు 53 మందికి పింఛను కూడ మంజూరయ్యాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వీ.జోగులు, సమర్ధి దొన్ను, కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# గురువిద్యాలయాల్లో 5వ తరగతి ప్రవేశాలకు ఆహ్వానం

విజయనగరం: జిల్లాలోని గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి ఇంగ్లీష్ మీడియం ప్రవేశానికి ఫిబ్రవరి 20వ తదేఈలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని బొబ్బిలి ఎ.పి బాలుర స్కూల్ ప్రిన్సిపాల్ మరియు కన్వీనర్ కోడి రాంబాబు తెలిపారు. బొబ్బిలి (బాలురు), తాటిపూడి (బాలికలు), తాడికొండ (రీజనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ బాలురు, గుంటూరు జిల్లా) పాఠశాలల్లో 2019-20 ప్రవేశం కల్పిస్తారు. మార్చి 9వ తేదీన రెవిన్యూ డివిజన్ కేంద్రాలలో ఉదయం 11 నుండి మధ్యాన్నం 1గంట వరకు ప్రవేశ పరీక్షలు ఉంటాయన్నారు. 4వ తరగతి స్థాయిలో తెలుగు, ఇంగ్లీషు మీడియంలో పరీక్షలు జరుగుతాయి. ఓసి, బిసిలకు 2008 సెప్టెంబర్ 1 నుండి 2010 ఆగష్ట్ 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఎస్సీఎస్టీలకు 2006 సెప్టెంబర్ 1 నుండి 2010 ఆగష్ట్ 31మధ్య జన్మించి ఉండాలన్నారు. 2017-18, 2018-19 విద్యా సంవత్సరాల్లో ప్రభుత్వ గు9ర్తింపు పొందిన పాఠశాలలో చదివినవారు , 2018-19 సం.4వ తరగతి చదువుతున్న వారు అర్హులు. సైనిక ఉద్యోగుల పిల్లలకు ఈ నియమం వర్తించదు. దరఖాస్తు చేసేందుకు సమాచారానికై 9866559614 మొబైల్ ను లేదా కార్యాలయం పనివేళల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

# పండగ వాతావరణంలో ఫించన్లు, పసుపు, కుంకుమ చెక్కుల పంపిణీ



విజయనగరం : పెంచిన ఫించన్లను, పసుపు, కుంకుమ చెక్కులను ఒక పండగ వాతావరణంలో పంపిణీ చేయాలని కౌన్సిలర్లకు మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ సూచించారు. గురువారం ఉదయం చైర్మన్ చాంబర్‌లో కౌన్సిలర్లతో మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ టి.వేణుగోపాల్ సమావేశం నిర్వహించారు. ఫించన్లు, పసుపు, కుంకుమ చెక్కుల పంపిణీ కార్యక్రమ ఏర్పాట్లు గురించి చర్చించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామ కృష్ణ మాట్లాడుతూ పెంచిన ఫించన్లపై వార్డుల్లో విస్తృత ప్రచారం చేయాలని, ప్రతీ లబ్ధిదారుడినీ కలుసుకొని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం గురించి తెలియజేయాలని సూచించారు. ప్రతీవార్డులో భోజనాలు పెట్టి మరీ ఫించన్లను అందజేయాలన్నారు. భోజనాలకు అయ్యే ఖర్చును స్థానిక ప్రజా ప్రతినిధులు సర్దుబాటు చేసుకోవాలని సూచించారు. పట్టణ వ్యాప్తంగా ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో లబ్ధిదారులకు ఫించన్లను అందజేయాలన్నారు. ఫించన్ల రెట్టింపు నిర్ణయం సంక్షేమ పథకాల అమలులో చారిత్రాత్మకమన్నారు. ఒకప్పుడు 200 రూపాయలు ఉన్న ఫించన్‌ను ఇప్పుడు రెండువేలు అయ్యిందన్నారు. అలాగే డ్వాక్రా మహిళలకు పసుపు, కుంకుమ క్రింద అందజేస్తున్న చెక్కులను ప్రతీవార్డులో పండగ వాతావరణంలో పంపిణీ చేయాలని సూచించారు. డ్వాక్రా మహిళలకు చెక్కులతో పాటు స్వీట్స్ కూడా పంపిణీ చేయాలని సూచించారు. పేదల దీవెనలు తెలుగుదేశం ప్రభుత్వానికే అందుతాయన్నారు. పసుపు, కుంకుమ చెక్కుల అంశంలో ప్రతిపక్షాల ఆరోపణలలో వాస్తవం లేదన్నారు. ప్రతీ పేదకుటుంబానికి చంద్రబాబు నాయకత్వంలో తెలుగుదేశం ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అవతార్ మొహర్ బాబా కేంద్రంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

విజయనగరం: స్థానిక అవతార్ మొహర్ బాబా కేంద్రంలో బాబావారి 50వ అమరతిథి కార్యక్రమాలు ఫిబ్రవరి 1వ తేదీ నుండి 27 రోజులపాటు నిర్వహిస్తున్నామని కేంద్ర వ్యవస్థాపకలు వడ్డాది గోపాలరావు తెలిపారు. ఈ కార్యక్రమాలు బాబావారి సమాధి వద్ద నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో ప్రతి రోజూ పలు కేంద్రాల్లో ఆధ్యాత్మిక, భక్తిరంజని కార్యక్రమాలుంటాయని తెలియజేశారు.

# నిస్వార్థంగా సేవలందిస్తే ప్రజల హృదయాల్లో నిలుస్తారు

## జిల్లా అదనపు ఎస్పీ ఎం.నర్సింహారావు,



విజయనగరం: సుదీర్ఘ కాలం పోలీసు శాఖలోబాధ్యతాయుతంగా ఎంతో క్రమశిక్షణతో విధులునిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం ఎస్ఐ పాత్తేరు మురళీ సంగమేశ్వర రావుకు అదనపు ఎస్పీ ఎం.నర్సింహారావు ఘనంగా "ఆత్మీయ వీడ్కోలు" పలికారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఈ వీడ్కోలు సభకు అద నపు ఎస్పీ ఎం. నర్సింహారావు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ ఎం.నర్సింహారవు గారు మాట్లాడుతూ ా సుదీర్ఘ కాలం పోలీసుశాఖకు ఎంతో క్రమశిక్షణతో విశిష్టమైన సేవలందించి, నేడు ఉద్యోగ విరమణ చేస్తున్న ఎస్ఐ మురళీ సంగమేశ్వర రావు సేవలను ఆయన కొనియాడారు.ఇటీవల 169 మంది కానిస్టేబుళ్ళు ఉద్యోగోన్నతి సాధించేందుకు మూడు వారాల శిక్షణను డిటిసిలో ఇవ్వడంలోను,వారు ఎటువంటి ఇబ్బందులు పడకుండా పర్యవేక్షణ చేయడంలో ఎస్ఐ మురళీ సంగమేశ్వరరావు కృషిని మరువలేమన్నారు. కుటుంబ జీవితాన్ని, వృత్తి జీవితాన్ని సమన్వయం చేస్తూ, ఉద్యోగంలోను, జీవితంలోను రాణించి, నేడు ఉద్యోగ విరమణ చేస్తున్న ఎస్ఐ మురళీ శేష జీవితం ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. నిజాయితీ, నిబద్ధతతో పనిచేసే పోలీసులకు గుర్తింపు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. నిబద్ధతతో పనిచేసారు కాబట్టే సర్వీసులో అనేక నగదు రివార్డులును ఎస్ఐ మురళీ సాధించ గలిగారన్నారు.

అనంతరం, ఉద్యోగ విరమణ చేసిన ఎస్ఐ పి.ఎం. సంగమేశ్వరరావును అదనపు ఎస్పీ శ్రీ ఎం. నర్సింహారావు దంపతులను నూతన వస్త్రాలను, పండ్లు, సాలువలతోను, పూలమాలతోను, జ్ఞాపికలతో సత్కరించి, ఘనంగా "ఆత్మీయ వీడ్కోలు" పలికారు. ఉద్యోగ విరమణ చేస్తున్న ఎస్ఐ మురళీ సంగమేశ్వరరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహకరించిన అధికారులకు, సిబ్బందికి, తన సేవలను గుర్తించడం, సన్మానించడం తన జీవితంలో ఎన్నటికీ మరువలేమని, జిల్లా అదనపు ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా పోలీసు ఉద్యోగుల కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరుపున నీలకంఠం నాయుడు, వారి సిబ్బంది ఉద్యోగ విరమణ చేస్తున్న పి.ఎం. సంగమేశ్వరరావుకు జ్ఞాపికను, చెక్‌ను అందజేసారు. ఎస్‌బి సిఐలు వై.వి. శేషు, జి. రామకృష్ణ, ఆర్ఐ రామకృష్ణలు ప్రసంగించి, ఎస్ఐ మురళీ సంగమేశ్వరరావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ ఎల్.శేషాద్రి, విజయనగరం ట్రాఫిక్ డిఎస్పీ ఎం. శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సిఐలు వై.వి. శేషు, జి. రామకృష్ణ, ఆర్ఐలు శ్రీహరిరావు, శంకరరావు, రామకృష్ణ, డిసిఆర్‌బి ఎస్సై అప్పారావు, ఎస్‌బి ఎస్ఐ ఇస్మాయిల్, డిటిసి ఎస్ఐ ఈశ్వరరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది మరియు ఇతర ఉద్యోగులు పాల్గని, శుభాకాంక్షలు తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

## రహదారి భద్రత ట్రాఫిక్ పోలీసుల బాధ్యత

సంబంధిత అధికారుల అనుమతులను పొందాల్సి ఉంటుందని, వెంటనే సంబంధిత వివరాల నివేదికను అందజేయాల్సిందిగా వియంఆర్డిఎ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల, సెల్ ఫోన్ డ్రైవింగ్ వల్ల జిల్లాలో ఎన్నో ద్విచక్రవాహనాలు, కార్లు రోడ్డు ప్రమాదానికి గురవుతున్నాయని, ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, వాటికి గల కారణాలను (మద్యం సేవన, నిద్రలేమి, మితిమీరిన వేగం, తదితరా) లను తెలుసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల కారణాలను తెలుసుకునేందుకు ముగ్గురితో సబ్ కమిటీ వేసి ప్రతి నెలలో మొదటి మంగళవారం ఆడిట్ రిపోర్టును తయారు చేసి రహదారి భద్రతా కమిటీకి నివేదించాలన్నారు. ప్రతినెలా రెండవ మంగళవారం సాయంత్రం వీటి పై సమీక్షించడం జరుగుతుందన్నారు.

ఆశీల్‌మెట్ట ,సంపత్ వినాయక్ గుడి, గాజువాక ప్రాంతాలలో పాఠశాలలు, కళాశాలలు ఎక్కువగా ఉన్నాయని, ఉదయం సాయంత్రం ట్రాఫిక్ స్తంభించి పోతున్నదని, పోలీసు అధికారులు కలక్టరు దృష్టికి తీసుకురాగా అందుకు కలక్టరు స్పందిస్తూ ఈ వారం రోజుల్లో సంబందిత పాఠశాలలు, కళాశాలల యాజమాన్యం, ట్రాఫిక్ పోలీసు అధికారులతో కలసి సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆయా పాఠశాలల ఉదయం సాయంత్రం వేళల సమయాల మార్పులపై చర్చించి ఒక్కొక్క పాఠశాలకు ఒక్కొక్క సమయాన్ని కేటాయించాల్సిందిగా జిల్లా విద్యాశాఖాధికారిని కలక్టర్ ఆదేశించారు. అదేవిధంగా అన్ని పాఠశాలలోను విధ్యార్ధులకు రహదారి భద్రతా, ట్రాఫిక్ రూల్స్, సిగ్నల్స్ , సింబల్స్ జీబ్రామార్కులు, తదితరాలపై అవగాహన కల్పించాలన్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, నిర్లక్ష్యంతో డ్రైవింగ్ చేసే ఆర్.టి.సి. బస్సు డ్రైవర్లను గుర్తించి క్రమ శిక్షణా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వెంటనే విధుల్లోంచి తొలగించాలని ఆర్ .టి.సి. అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రానున్న రోజుల్లో ఆర్.టి.సి. బస్సుల వల్ల జిల్లాలో ఎటు వంటి ప్రమాదాలు జరుగకూడదని, అందుకు అనుగుణంగా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైతే ఆర్ .టి.సి. డ్రైవర్లకు డ్రైవింగ్, రోడ్ సిగ్నల్స్ పై శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.

ఉప రవాణా కమిషనర్ ఎస్.వెంకటేశ్వరరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో డిశంబర్ 2018 మాసంలో జరిగిన రోడ్డు ప్రమాదాలు, మరణాలు, వాటి నివారణకు తీసుకుంటున్న రహదారి భద్రత చర్యలను కలెక్టర్ కు వివరించారు. ఫిబ్రవరి 4వ తేదీనుండి 10 వ తేదీ వరకు రోజుకొక అంశంపై రహదారి భద్రతా వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ఈ సమావేశంలో జివియంసి కమిషనర్ హరినారాయణన్, ఏ.డి.సి.పి. (ట్రాఫిక్) రవికుమార్, నేషనల్ హైవేస్ పిడి వెంకటరత్నం, వైద్యఆరోగ్యం, ట్రాన్కో, ఆర్టిసి, వియంఆర్డిఎ, రవాణా, ఎక్సైజ్, రోడ్లు, భవనాలు, పంచాయితీరాజ్, జి.వి.ఎం.సి. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిదులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## 2, 3, 4 తేదీలలో పింఛన్ల పండగ

మహిళలకు పసుపు-కుంకుమ పేరుతో రూ.10వేలు సాయమందించారు. అదే ఊపులో మరో రెండు కీలక నిర్ణయాలు తీసుకునే ఆలోచనలో ఉన్నారు. నిరుద్యోగ భృతి పెంపు, రైతులకు సాయం అందించేందుకు కసరత్తు చేస్తున్నారట. ఇదే అంశాన్ని గురువారం జరిగిన టీడీఎల్పీ సమావేశంలో ప్రస్తావించారు.

యువనేస్తం కింద నిరుద్యోగ భృతి పెంచేందుకు కసరత్తు చేస్తున్నామని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో చంద్రబాబు చెప్పారట. రూ.1000 నుంచి రూ.2వేలకు పెంచే ఆలోచన చేస్తున్నామని.. ఎన్నికల్లోపే నిరుద్యోగ భృతి పెంపును అమలు చేస్తామన్నారట. రైతులకు, కౌలు రైతులకు మేలు చేసే విధంగా పథకాలు తెస్తున్నామని చెప్పారు. ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో పింఛన్ల పండుగ జరపాలని నేతలకు సూచించారు. ఫిబ్రవరి 9న 4 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు చేయబోతున్నట్లు తెలిపారు.

ఢిల్లీ దీక్షకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రావాలి

ఫిబ్రవరి 11న ఢిల్లీలో నిర్వహించే దీక్షకు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకావాలని చంద్రబాబు ఆదేశించారు. విజయవాడ నుంచి రెండు ప్రత్యేక రైళ్లను కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. శుక్రవారం సభ్యులందరూ ఉభయసభలకు నల్ల చొక్కాలతో హాజరు కావాలని అధినేత సూచించారు. అసెంబ్లీలో పునర్విభజన చట్టం అమలుపై చర్చ జరగనుందని.. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై సభలో చర్చించబోతున్నట్లు తెలిపారు. చర్చ అనంతరం ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామన్నారు చంద్రబాబు.

ఎన్నికల వ్యూహాలపై చర్చ

టీడీఎల్పీ భేటీలో అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ప్రచారం వంటి అంశాలను చంద్రబాబు ప్రస్తావించారు. ఫిబ్రవరి నెలాఖరు కల్లా అభ్యర్థుల ఎంపిక పూర్తి చేయాల్సి ఉందని.. నేతలు ఎన్నికల ప్రచారానికి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. 30 రోజుల పూర్తి స్థాయి ఎన్నికల ప్రచారం చేస్తానని.. రోజుకు రెండు జిల్లాలు తిరగాలా..? రోడ్ షోలు నిర్వహించాలా..? బస్సు యాత్రలు చేపట్టాలా..? అనేది త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటానన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మంచిచేసే పథకాలను అమలు చేశామని.. ప్రజలకు చేసిన పనిని ఎందుకు చెప్పలేకపోతున్నారని నేతల్ని ప్రశ్నించారు.

## ఉప ఎన్నికలో 'చెయ్యి' జోరు

నిర్వహించారు. భాజపా నుంచి హరిచంద్ కుమారుడు కృష్ణ మిద్దా బరిలోకి దిగగా.. కాంగ్రెస్ నుంచి ఆ పార్టీ సీనియర్ నేత రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా, జననాయక్ జనతా పార్టీ నుంచి దిగ్విజయ్ చౌతాలా పోటీ చేశారు. నేడు ఓట్ల లెక్కింపు చేపట్టగా భాజపా అభ్యర్థి కృష్ణ ఆధిక్యంలో కొనసాగుతున్నారు. దిగ్విజయ్ చౌతాలా రెండో స్థానంలో ఉండగా.. రణ్‌దీప్ సుర్జేవాలా మూడో స్థానానికి పడిపోయారు.

## భవనం పైనుంచి పడి ఐదుగురు కూలీల దుర్మరణం

మిగతా కూలీలు ఆగ్రహంతో నిర్మాణ సంస్థ కార్యాలయంలో అద్దాలను, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసుల రంగ ప్రవేశంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఘటనా స్థలికి చేరుకున్న మల్కాజిగిరి డీసీపీ ఉమామహేశ్వర శర్మ పరిస్థితిని సమీక్షించారు. ఐదుగురు కూలీల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. గుత్తేదారులు ఎలాంటి భద్రతా ప్రమాణాలూ పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని తోటి కూలీలు ఆరోపిస్తున్నారు. మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లిస్తామని గుత్తేదారు హామీ ఇచ్చారు.

## కేంద్రంలో హంగ్ ఏర్పడితేనే మేలు

దాదాపు అన్ని రాష్ట్రాలకు రైల్వేజోన్ ఉంది. రైల్వే జోన్ సాధన కోసం మా పోరాటం ఆగదు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో ఏ పార్టీకీ పూర్తి మెజార్టీ రాదు. కేంద్రంలో హంగ్ వచ్చే అవకాశాలున్నాయని సర్వేలు చెబుతున్నాయి. అలా జరిగితే రాష్ట్రానికి కచ్చితంగా మేలు జరుగుతుంది. రాష్ట్రంలోని 25 ఎంపీ స్థానాలను ప్రజలు వైకాపాకు ఇస్తారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వే జోన్ వస్తుంది. ఎన్నికలకు ముందు ఎవరితోనూ పొత్తులు పెట్టుకోం. ప్రత్యేక హోదాపై సంతకం పెట్టిన తర్వాతే మద్దతు ఇస్తాం. హామీలు నమ్మి ఎన్నికలకు ముందే పొత్తు పెట్టుకుంటే మోసపోతాం అని జగన్ అన్నారు.

## వైఎస్సార్‌సీపీలోకి మేడా మల్లికార్జునరెడ్డి

చేశారని ఇదివరకే మేడా మల్లికార్జునరెడ్డి చెప్పారు. వైఎస్సార్ సీపీ నుంచి రాజంపేట అభ్యర్థిగా ఎవరిని నిలబెట్టినా కలిసి పనిచేస్తామన్నారు. 2014 ఎన్నికల్లో వైఎస్ఆర్ జిల్లాలో పోటీ చేసి.. గెలిచిన ఏకైక టీడీపీ అభ్యర్థి మేడా మల్లికార్జునరెడ్డి. ఆయనతోపాటు రాజంపేట నుంచి భారీ ఎత్తున వచ్చిన ఆయన అనుచరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ప్రతి ఒక్కరినీ పలకరించిన వైఎస్ జగన్.. కండువాలు కప్పి వారిని పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సందడి నెలకొంది.

ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశా: మేడా

వైఎస్సార్‌సీపీలో చేరిన సందర్భంగా మేడా మల్లికార్జునరెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే పదవికి తాను రాజీనామా చేసినట్టు ఆయన వెల్లడించారు. స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా లేఖను తాను పంపానని తెలిపారు. వైఎస్ జగన్‌తోనే ఏపీ అభివృద్ధి సాధ్యమని చెప్పారు. గత నాలుగున్నరేళ్లుగా అమలు చేయని హామీలు ఇప్పుడు ఎలా చంద్రబాబు అమలు చేస్తారని మేడా ప్రశ్నించారు. ఎన్నికల నేపథ్యంలోనే చంద్రబాబు కొత్త వాగ్దానాలు ఇస్తున్నారని, ఆయన హామీలను ప్రజలు నమ్మబోరని పేర్కొన్నారు.

## ఘనంగా కుంచుమాంబ అమ్మవారి పరస మహోత్సవాలు



మల్కాపురం: జీవీఎంసీ 47వ వార్డు శ్రీహరిపురంలో గురువారం శ్రీ కుంచుమాంబ అమ్మవారి పరస సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరి అమ్మవారికి పసుపు కుంకుమలు పూజలు సమర్పించారు. ఈ మహోత్సవాలకి ముఖ్యఅతిథిగా జనసేన నాయకులు డాక్టర్ పివి సురేష్ పాల్గొని అమ్మవారికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు గావించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి దైవ కార్యక్రమంలో యువతంతా కలిసికట్టుగా పాల్గోవడం చాలా ఆనందకరమైన విషయం అని, మనందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మరియు జనసేన నాయకులు పాల్గొన్నారు.

## రామకృష్ణా రైతు బజార్ పనులను త్వరగా పూర్తి చేయండి

26వ వార్డులో పర్యటన .. కాలువలలో మురుగు ప్రవహించేలా పూడిక తీయండి
ప్లాస్టిక్ సంచుల వాకడంపై అసంతృప్తి, రూ.500/-లు జరిమాన .. గేదెలు పెంపకందారునికి పదివేలు జరిమానా
పూర్ణామార్కెట్ పరిసరాలు సక్రమంగా నిర్వహించండి .. జివిఎంసి కమిషనర్ హరినారాయణన్



విశాఖపట్నం: రామకృష్ణా రైతు బజార్ పనులను పది రోజులలో పూర్తి చేయాలని జివిఎంసి కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా 26వ వార్డు పరిధిలోని పూర్ణా మార్కెట్, రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డు, వెలంపేట, పల్లుం పుల్లల సందు, పువ్వుల సందులలో గురువారం పర్యటించి పలు సూచనలు చేశారు. కాలువలలో చెత్త పేరుకుపోయి మురుగు ప్రవహించడం లేదని, తక్షణం చెత్త తొలగించి మురుగు ప్రవహించేలా చూడాలని ఆదేశించారు. మెయిన్ రోడ్లను శుభ్రంగా ఉంచడమే కాదు, ప్రక్కసందు రోడ్లను కూడా సక్రమంగా, స్వచ్ఛంగా నిర్వహించాలని సూచించారు. తొలుత 26వ వార్డు కార్యాలయాన్ని సందర్శించి హాజరు పరిశీలించారు. అనంతరం మార్కెట్‌లో 0-50 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న షాపు యజమానికి (రూ.500) ఐదువందల రూపాయల జరిమాన విధించారు. తదుపరి వీధిలో గేదెలను పెంచుతూ పరిశుభ్రత, ప్రజారోగ్యానికి భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తున్న యజమానికి పది వేల రూపాయల జరిమాన విధించారు.

పూర్ణామార్కెట్, పూర్ణామార్కెట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కమిటీ సభ్యులను కోరారు. మార్కెట్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించేలా వాహనాన్ని నిలిపిఉంచుతామని, మార్కెట్‌లోని వ్యాపారులు చెత్తను వాహనంలో వేసేలా చూడాలని పేర్కొన్నారు. ఉచిత యూరినల్స్‌ను ప్రతిరోజు పరిశుభ్రం చేసేలా చూడాలని కోరారు. ఆ ప్రక్కనే ఉన్న ప్రజామరుగుదొడ్డిని పరిశీలించి పరిశుభ్రంగా ఉంచిన కేర్‌టేకర్‌ను అభినందించారు.

రామకృష్ణా రైతు బజార్ పనులను పరిశీలించి పది రోజులలో పూర్తి చేయాలని ఇ.ఇ గణేష్ కుమార్‌ను ఆదేశించారు.

నూతనంగా నిర్మిస్తున్న భవనాలు రోడ్డుపైకి ప్రాజెక్ట్ చేసేలా నిర్మిస్తున్నారని, వాటికి అనుమతులు ఉన్నది లేనిది పరిశీలించాలని ఎసిపి సత్యనారాయణను ఆదేశించారు.

అన్ని షాపులలో డస్ట్‌బిన్లు ఉండేలా చూడాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యామలరావును ఆదేశించారు. పర్యటనలో మూడవ జోనల్ కమిషనర్ చిట్టిబాబు, జోనల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పీఎంపాలెంలో ఏసీబీ సోదాలు



మధురవాడ: ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాడన్న సమాచారంతో మైన్స్ అండ్ జియాలజీ విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న గొండు శివాజీ ఆస్తులపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున 6 గంటల నుండి దాడులు కొనసాగించారు. ఏక కాలంలో ఆరు చోట్ల అవినీతి నిరోధక శాఖ అధికారులు సోదాలు జరిపారు. ఇందులో భాగంగా మహా విశాఖ నాల్గవ వార్డు పరిధి పీఎంపాలెం చివరి బస్టాప్ సమీపంలో ఎన్ కె హోమ్స్ అపార్ట్‌మెంట్ 4వ అంతస్తులో నివాసముంటున్న గొండు శివాజీకి వరసకు కూరాకుల చంద్ర శేఖర్ స్వయానా బావమరిది ,ఈ నేపథ్యంలో ఆయన నివాసంలో కూడా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు, అయితే అక్రమాస్తులకు ఎటువంటి ఆధారాలు, పత్రాలు లభించలేదు. ఈ దాడుల్లో ఏసీబీ సి ఐ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## మాంసం దుకాణాల ఆధునీకరణకు శంకుస్థాపన



మల్కాపురం: జీవీఎంసీ 47 వార్డు పరిధిలోగల గురువారం గుల్లలపాలెం వాణిజ్య సముదాయంలో ఉన్న మాంసము దుకాణాల ఆధునీకరణకు సుమారు 5 లక్షల రూపాయలు వ్యయంతో శంకుస్థాపన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వార్డు అధ్యక్షులు వంశీ కిషోర్ యాదవ్ శంకుస్థాపన చేశారు.

ఇదే తరహాలో ఎం ఐ జి వుడా కాలనీలో రోడ్లు కాలువలు పనులకు నిమిత్తం సుమారు 45 లక్షల రూపాయలు వ్యయంతో శంకుస్థాపన చేశారు. వార్డు అధ్యక్షుడు వంశీ కిషోర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమలో భాగంగా ఇటువంటి కార్యక్రమాలు ఎన్నో తెలుగుదేశం పార్టీ చేపడుతుందని, వార్డులో కోట్ల రూపాయలు నిధులతో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని, రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధినీ ప్రజలు గమనిస్తున్నారని, పార్టీని విజయంలోకి ప్రజలే తీసుకు వస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఈ మణికుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు పొట్టి మూర్తి, రేవల్ల సత్యనారాయణ, మహేష్ , మంజు మరియు కార్యకర్తలు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## ఆర్కిటెక్చర్ కౌన్సిల్ అధ్యక్షుడు గీతం సందర్శన



సాగర్‌నగర్: దేశంలో ఆర్కిటెక్చర్ విద్యను పర్యవేక్షించే కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సిఓఎ) నూతన అధ్యక్షుడిగా నియమితులైన విజయ్ గార్గ్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌ను సందర్శించారు. గీతం ఇన్‌ఛార్జి వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ లను కలిసిన అనంతరం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆర్కిటెక్చర్ కోర్సు పూర్తి చేసిన అనంతరం ప్రతి విద్యార్థి తమ పేర్లను ఆర్కిటెక్చర్ కైన్సిల్‌లో నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఇతర దేశాలలలో పి.జి. డిగ్రీలు చదువాలనుకునే వారు ఆయా డిగ్రీలకు భారత దేశంలో గుర్తింపు ఉందా లేదా అనే విషయాన్ని ధృవీకరించుకోవాలన్నారు. ఆర్కిటెక్చర్ కోర్సు బోధించే వారు తరగతి గదులలే పరిమితం కాకుండా కన్సల్టెన్సీ సేవల ద్వారా తమలో నైపుణ్యాన్ని మెరుగు పరుచుకోవాలని సూచించారు.

స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డిప్యూటీ డైరక్టర్ క్రిష్ణ కాశీ మాట్లాడుతూ గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ద్వారా బిఆర్క్ విద్యార్థులకు అంతర్జాతీయ స్టడీ టూర్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. నాటా ప్రవేశ పరీక్షలో ఈ ఏడాది ప్రవేశ పెట్టిని మార్పుల ఆధారంగా బిఆర్క్ ప్రవేశాలు కల్పిస్తామని వెల్లడించారు.

కార్యక్రమంలో భాగంగా స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ విద్యార్థుల డిజైన్ ఎగ్జిబిషన్‌ను విజయ్ గార్గ సందర్శించారు. విద్యార్థులకు పలు సూచినలు ఇచ్చారు.

## గీతం ఎన్.ఎస్.ఎస్. వలంటీర్ల రక్తదానం



సాగర్‌నగర్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రక్తదాన శిభిరంలో ఎన్.ఎస్.ఎస్. వలంటీర్లు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు.రక్తదాన శిభిరాన్ని ప్రారంభించిన ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్యామప్రసాద్ మాట్లాడుతూ రక్తదానం తరచుగా చేసే వారిలో హృద్రోగాలకు గురయ్యే శాతం తక్కువగా ఉంటుందన్నారు. రక్తదానం ద్వారా యువతలో నూతన ఉత్సాహం చేకూరుతుందన్నారు. గీతం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎమ్. జయ ప్రకాశ్ బాబు మాట్లాడుతూ రక్తదానం చేసిన వారిలో తిరిగి నాలుగు వారాలలోనే కొత్త రక్తం వచ్చి చేరుతుందన్నారు. కొత్త రక్తం చేరిక శరీరానికి మంచిదన్నారు.

గీతం ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.వి.స్వామి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎల్లప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాథాలజీ విభాగం అధిపతి డాక్టర్ కె.వి.మురళీ మోహన్, ఎన్.ఎస్.ఎస్.ప్రోగ్రమ్ ఆఫీసర్ మహ్మద్ కె.ఎమ్.చిస్టి, ఆర్.గోపీనాధ్, డాక్టర్ బి.సూరిబాబు నాయిక్ , రామమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రక్త దాన శిభిరంలో పాల్గొన్న 200 మంది ఎన్.ఎస్.ఎస్. వలంటీర్ల ద్వారా 137 యూనిట్ల రక్తాన్ని సేకరించామని గీతం బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఎస్. సుధాకర్ తెలిపారు. విద్యార్థుల సేవ నిరతిని అభినందించారు.

## సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే గణబాబు చిత్రపటాలకు పాలాభిషేకం



మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం 49వ వార్డు పరిధిలో గల దుర్గానగర్‌లో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే గణబాబు చిత్రపటాలకు పాలాభిషేకం కార్యక్రమాన్ని వార్డు ఉపాధ్యక్షుడు మజ్జి మాలినాయుడు ఆధ్వర్యంలో చేపట్టారు. అభిషేకం అనంతరం మాలి నాయుడు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని అటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇటు ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేయడంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబుకు సాధ్యం అని ప్రజల యొక్క గుండెల్లో ప్రజా దైవంగా చిరస్థాయిగా గుర్తుండిపోయేలా ఈ పాలాభిషేకం కార్యక్రమం ఏర్పాటు చేశామని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా పేద ప్రజలకు అందాలంటే రానున్న ఎన్నికల్లో మళ్లీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావలసిన ఆవశ్యకత ఉంది అని ఆయన అన్నారు.

వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేశ్ మాట్లాడుతూ అభివృద్ధి మరియు సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన సాగిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణానికి చారిత్రికత అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నీలాపు జోగిబాబు, జగదీష్, గంగాధర్, సన్యాసిరావు, ఆ ప్రాంత మహిళలు పాల్గొన్నారు.

## మహిళా వసతిగృహ నిర్మాణం ప్రారంభం

### వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు



ఆంధ్ర విశ్వకళాపరిషత్: ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థినులకు ఉపయుక్తంగా నూతనంగా నిర్మిస్తున్న హాస్టల్ సముదాయానికి గురువారం ఉదయం వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు భూమిపూజ చేసి ప్రారంభించారు. సిబిఐ కూడలి వద్ద విద్యార్థినులకు రూ 2కోట్లు వ్యయంతో నూతన హాస్టల్ సముదాయాన్ని నిర్మిస్తున్నారు. పదివేల చదరపు అడుగుల విస్తీర్ణంతో తొలి అంతస్థును నిర్మిస్తున్నారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.నిరంజన్, చీఫ్ ఇంజనీర్ ఎం.జి మాధవ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్డీఐని సందర్శించిన హెచ్‌పీసీఎల్ డైరెక్టర్లు



ఆరిలోవ: దీనదయాళపురంలో నెలకొల్పిన స్కిల్ డెవలప్ మెంట్ ఇన్స్టిట్యూట్‌ను హిందుస్థాన్ పెట్రోలియంకు చెందిన నిర్దేశకులు పుష్ప్ కుమార్ జోషీ మరియు జయకృష్ణన్ గురువారం సందర్శించారు. వివిధ విభాగాలను పరిశీలించి కొనసాగుతున్న కోర్సుల వివరాలు, మౌళిక సదుపాయాలు గురించి తెలుసుకున్నారు. స్థాపించిన 2 సంవత్సరాలలోనే 5000 మందికి పైగా నిరుద్యోగ యువతకు శిక్షణనిచ్చి 80 శాతానికి మించి ఉపాధి కల్పించిన సంస్థను కొనియాడుతూనే, ఇంధన రంగ పెట్రోలు బంకు ఆపరేటర్లు, ఎల్‌పీజీ మెకానిక్కులు, పైపు ఫిట్టర్లు లాంటి కోర్సులకు తమ సహకారాన్ని అందిస్తామని అన్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా విర్చువల్ రియాలిటీ సాంకేతికతతో ప్రవేశపెట్టబడిన ఫార్మా రంగానికి చెందిన మెషిన్ ఆపరేటర్ మరియు ప్రొడక్షన్ కెమిస్ట్ కోర్సులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

వంద శాతం విదేశీ ఉపాధి కల్పన ధ్యేయంతో భోగాపురంలో కొత్త శిక్షణా కేంద్రం నెలకొల్పి ఫిబ్రవరి 20 నుండి ఫిట్టరు, వెల్డరు కోర్సులు ఉచితంగా 3 నెలల శిక్షణ, వసతి భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్టు కార్యదర్శి నగేష్ తెలియజేశారు.

ఆసక్తి గల పదవ తరగతి పాసైన అభ్యర్థులు 9290895161 లేదా 8985883388 నంబర్లలో ఫోను చేసి వివరాలు తెలుసుకోవచ్చని ప్రిన్సిపాల్ సీ.వీ.నరసింహ దాసు తెలిపారు.

సీజీఎం ఇలాంగో, మహేష్, శ్రీనివాస్, 400 మంది సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏపి పీజిఇసెట్ కార్యాలయం ప్రారంభం



ఆంధ్ర విశ్వకళాపరిషత్: ఏపిపిజి ఇంజనీరింగ్ సెట్ 2019 కార్యాలయాన్ని వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు గురువారం ఉదయం ప్రారంభించారు. ఏపిపిజిఇసెట్ పరీక్ష నిర్వహణ బాధ్యతను ఉన్నత విద్యామండలి ఏయూకు అప్పగించింది. సెట్ కన్వీనర్‌గా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ఆచార్యులు పి.ఎస్ అవధానిని నియమించింది. సెట్ కార్యాలయాన్ని ఇంజనీరింగ్ కళాశాల పరీక్షల విభాగంలో వీసీ నాగేశ్వర రావు ప్రారంభించారు. పటిష్టంగా, సమర్ధవంతంగా పరీక్షల నిర్వహణ జరపాలని సూచించారు. మే 1 నుంచి 4వ తేదీ వరకు ఏపీపీజీ ఇ సెట్ పరీక్షలు జరగనున్నాయి. కార్యక్రమంలో వర్సిటీ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సమర్ధసేవలు అందించాలి



ఆంధ్ర విశ్వకళాపరిషత్: విద్యార్థులకు సమర్ధ సేవలు అందించే దిశగా బోధనేతర సిబ్బంది తమ సామర్థ్యాలు, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. గురువారం ఉదయం ఏయూ యూజీసీ హెచ్ఆర్‌డిసి కేంద్రంలో నిర్వహించిన బోదరనేతర ఉద్యోగుల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ముందుగా ఉద్యోగులు తమ వైఖరుల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు.ఉద్యోగులు పదోన్నతులు పొందడంతో పాటు, విద్యార్హత, నైపుణ్యాలను పెంపొందించుకోవడం అవసరమన్నారు. భావ ప్రకటన నైపుణ్యాలు సమర్ధవంతంగా కలిగి ఉండటం, విధి నిర్వహణలో వీటిని కాలానుగుణంగా వినియోగించడం అవసర మన్నారు. వత్తిడిని సమర్ధవంతంగా అధిగమించే విధానాలను తెలుసుకుని వినియోగించాలన్నారు. సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు.

కేంద్రం సంచాలకులు ఆచార్య పి.విశ్వనాదం మాట్లాడుతూ బోధనేతర ఉద్యోగుల సామర్థ్యాలను పెంపొందించే చర్యల్లో భాగంగా స్వల్పకాలిక శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతోందన్నారు. ఆర్‌టిఐ చట్టం, వర్సిటీ ఆర్థిక వనరులు నిర్వహణ, కమ్యూనికేషన్ స్కిల్స్, వత్తిడి నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కేంద్రం సహ సంచాలకులు ఆచార్య ఎన్.ఏ.డి పాల్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత జీవితం సంతోషంగా, ఆనందంగా సాగాలి

### - అదనపు కమిషనర్ (జనరల్) జివివియస్ మూర్తి



విశాఖపట్నం :- విశ్రాంత జీవితం సంతోషంగా, ఆనందంగా కొనసాగాలని జివియం సి అదనపు కమిషనర్ (జనరల్) జివివియస్ మూర్తి పేర్కొన్నారు. అదనపు కమిషనర్ ఛాంబర్‌లో గురువారం ఆయన రిటైరైన ఉద్యోగులు కె నాయుడు, టి.పి చైన్‌మెన్ జోన్-2, వై.బి.సత్యానందరావు వాచ్‌మెన్ జోన్ 6, వి.కనకరాజు హెచ్.వి. డ్రైవర్ జోన్ -1 లను సన్మానించారు. జివియంసిలో పనిచేసి ఆనందంగా రిటైర్ అవడం కూడా ఒక అదృష్టంగా పేర్కొన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను కూడా అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### చెదరని వ్యక్తిత్వం ఫెర్నాండేజ్‌ది

నిరంతరం ఉద్యమాలతో, రాజకీయాలతో మమేకమైన అరుదైన స్వతంత్ర ఆలోచనాధార గల నాయకుడు జార్జి ఫెర్నాండెజ్ కన్ను మూయడం ఒక శకసమాప్తిని సూచిస్తున్నది. ప్రత్యేకించి కార్మికోద్యమాలలో, సోషలిస్టు రాజకీయాలలో ఆయన నిర్వహించిన క్రియాశీల పాత్ర విస్మరించలేనిది. తాను నమ్మిన వాదనను, ఎంచుకున్న మార్గాన్ని అత్యంత కఠోరంగా, ఉద్వేగభరితంగా ఆచరించే, అనుసరించే వ్యక్తిత్వం ఆయనది. ఈ పోరాట స్వభావం, చెదరని వ్యక్తిత్వమే ముంబయిలో పేవ్‌మెంట్లపై పడుకున్న ఆయనను కేంద్రమంత్రి స్థాయికి చేర్చింది. కేంద్ర మం త్రిగా ఉంటూనే విదేశాలలోని వేర్పాటు ఉద్యమాలకు ఊతం ఇవ్వడం ఆయనకే చెల్లింది. క్రైస్తవాలయంలో పూజారిగా శిక్షణ పొందుతున్న క్రమంలో అక్కడి పరిస్థితులను ఆమోదించలేక, ముంబయి పారిపోయినప్పుడు ఆయన వయసు పందొమ్మిదేండ్లు! ఆ గడ్డు కాలమే ఆయనను కరుడుగట్టిన ఉద్యమకారుడిగా మార్చింది. 1960 దశకం నుంచి ప్రతి దశాబ్దంలోనూ కాల పరిస్థితులకు అనుగుణంగా రూపుదిద్దుకుంటూపోయారు. మన దేశం ఒక్కో దశలో చవిచూసిన సంక్షోభాలకు, రాజకీయాలకు ఆయన నిరంతర పరిణామం అద్దం పడుతుంది. ఫెర్నాండెజ్ ఆయా కాలాలలో నిర్వహించిన పాత్రపై విమర్శలు ఉండవచ్చు. ఆయన భావజాలంతో అంద రూ ఏకీభవించకపోవచ్చు. తొలిదశాబ్దాల ఉద్యమ జీవితానికి, చివరిదశ రాజకీయాలకు పొంతన కుదరకపోవచ్చు. కానీ జార్జి ఫెర్నాండెజ్ జీవితాన్ని దేశ పరిణామాల నుంచి విడదీసి చూడలేము. ముంబయిలో అడుగుపెట్టిన అనతికాలంలో రామ్ మనోహర్ లోహియా సోషలిస్టు రాజకీయాలతో ఫెర్నాండెజ్ ప్రభావితులయ్యారు. అప్పటికే బలమైన కాంగ్రెస్ నాయకులకు, కమ్యూనిస్టు ఉద్యమయోధులకు ముంబయి వేదిక. కానీ ఫెర్నాండెజ్‌లోని ఉద్వేగం, కఠోర శ్రమ వారిని అధిగమించేవిధంగా చేసినయి. టాక్సీ డ్రైవర్ల సంఘాన్ని బలమైందిగా తీర్చిదిద్ద డం ఆయన ఉద్యమాలకు మొదటి మెట్టు. 19 50, 60 దశకాలలో అనేక బందులు, సమ్మెలు నిర్వహించారు. అనేకసార్లు శిక్షలు పడ్డాయి. ముంబయి కార్మికవర్గంతో ఎంతగా మమేకమ య్యారంటే, ముంబయిలో కిరీటం లేని మహారాజుగా వెలుగుతున్న కాంగ్రెస్ ఘనాపాటిని 1967 లోక్‌సభ ఎన్నికలలో ఫెర్నాండెజ్ మట్టి కరిపించారు. ఈ విజయంతో ఫెర్నాండెజ్ జాతీ యస్థాయిలో గుర్తింపు పొందారు. ఒకవైపు ఇం దిరాగాంధీ బలమైన, జనాకర్షణ గల నాయక త్వం. మరోవైపు భిన్న సైద్ధాంతిక రాజకీయప క్షాల పోరాటం. దేశవ్యాప్తంగా వివిధ వర్గాలలో అనిశ్చితి, అసంతృప్తి ఉద్యమాలుగా పెల్లుబుకుతున్న కాలమది. 1974లో ఫెర్నాండెజ్ నాయకత్వంలోని రైల్వే మెన్స్ ఫెడరేషన్ జరిపిన సమ్మె తదనంతర దేశ రాజకీయాలను ప్రభావితం చేసింది. ఇరువై రోజుల పాటు రైళ్ళు నిలిచిపోయాయి. ఆ తర్వాత జయప్రకాశ్ నారాయణ్ కేంద్ర బిందువుగా రాజకీయపక్షాల ఆందోళన మొదలైంది. 1975 జూన్‌లో ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించారు. ప్రతిపక్ష నాయకులను జైలులో పెట్టారు గానీ ఫెర్నాండెజ్ దొరుకలేదు. సోషలిస్టు రాజకీయాలలో ఉన్నా ఆయనది కమ్యూనిస్టులను పోలిన ఉగ్రవాద పోకడ. ఇందిరాగాంధీ సభా వేదికల దగ్గర పేలుళ్ల జరిపించడానికి కుట్ర పన్నారనేది ఆయనపై ఆరోపణ. ఎమర్జెన్సీ విధించిన ఏడాదికి ఆయన దొరికారు. బరోడా డైనమైట్ కేసులో ఆయన ముద్దాయి. ఆయన జైలులో ఉంటూనే 1977 ఎన్నికలలో జనతాపార్టీ అభ్యర్థిగా పోటీచేశారు. సంకెళ్ళతో ఉన్న ఫెర్నాండెజ్ పోస్టర్లతో ప్రచారం సాగింది. మూడు లక్షల మెజార్టీతో ఆయన విజయం సాధించి లోక్‌సభలో అడుగుపెట్టి పరిశ్రమల మంత్రి అయ్యారు. దీంతో ఆయన ఉద్యమకారుడి స్థానంలో కొత్త రాజకీయ నాయకుడు అవతరించాడు. 1970 దశకానికి ముందు తర్వాత ఫెర్నాండెజ్‌లో మార్పు కనిపిస్తుంది. 1969లో సంయుక్త సోషలిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా, ఆ తర్వాత 1973లో సోషలిస్టు పార్టీ చైర్మన్‌గా బాధ్యత లు చేపట్టారు. కానీ ఆయన ఇందిరాగాంధీ వ్యతిరేకిగా, కాంగ్రెస్‌కు బద్ధ విరోధిగా ఉన్నంతగా, ముంబయిలో ప్రైవేటు పరిశ్రమల పురోగతిని అడ్డుకోలేదు. ఒక నిలకడైన రాజకీయ విధానాన్ని కొనసాగించలేకపోయారు. మొరార్జీ దేశాయికి అనుకూలంగా పార్లమెంటులో అనర్గళంగా ప్రసంగించి, ఆ మరుసటి రోజే ఫిరాయించడం విమర్శలకు తావిచ్చింది. జనతాదళ్ ఏర్పాటులోనూ ఆయన ప్రధాన పాత్ర పోషించారు. కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా అత్యంత బలంగా ఉన్నప్పుడు, ఎమర్జెన్సీని వ్యతిరేకించిన క్రమంలో, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, సోషలిస్టు నేతలు పరిమి త అవగాహనతో జనసంఘ్‌తో చేతులు కలిపారు.



విశాఖ దక్షిణ నియోజక వర్గంలో సమన్వయ కర్త డాక్టర్ పీవీ రమణ మూర్తి ఆధ్వర్యంలో 15 వ వార్డులో రావాలి జగన్...కావాలి జగన్...హాజరైన వార్డు అద్యక్షుడు సర్వేశ్వర రెడ్డి ఇతర నాయకులు లంకా శ్రీను, చిన్ని, ప్రసాద్, అజయ్ రెడ్డి తదితరులు



విశాఖపట్నం దక్షణ నియోజకవర్గం పరిధిలో 30వార్డు అల్లిపురము ప్రాంతం లో వైకాపా మహిళా విభాంగం అద్యక్షులు గరికిణ గౌరి ఆద్వర్యంలో ఇంటింట నవరత్నాలు కార్యక్రమం ఈరోజు జరిగింది.
కార్యక్రమానికి ముఖ్య అతిధిగా దక్షణ నియోజకవర్గం సమన్వయకర్త డాక్టరు పి వి రమణమూర్తి హాజరయ్యారు సబీరా బేగం, బంగారమ్మ తదితరులు హాజరయ్యారు.

## కైట్స్ కళాశాలలో ఫేర్‌వెల్ ఫెస్టివల్



అచ్యుతాపురం : విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి కళాశాలకు ,తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి అన్నారు .గురువారం స్థానిక కైట్స్ కళాశాలలో ఫేర్ వల్ ఫెస్టివల్ నిర్వహించారు .ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు . అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షించాయి .ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లు ఆడారి అప్పలనాయుడు ,ఆడారి సన్యాశిరావు ,డైరెక్టర్లు విల్లూరి ప్రసాద్ ,సరిస నాగేశ్వరరావు, విద్యార్థిని ,విద్యార్థులు పాల్గొన్నా రు .

## ఫిబ్రవరి 8న 4 జీడి తోటలు వేలం : డీఎఫ్ఓ



నర్సీపట్నం: నర్సీపట్నం అటవీ రేంజ్ పరిధిలో గల 4జిబి తోటలను ఫిబ్రవరి 8వ తేదీన వేలం వేస్తున్నట్లు డివిజనల్ ఫారెస్ట్ అధికారి డాక్టర్ జి శేఖర్ బాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తిగల వారు పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

రేంజ్ కార్యాలయం లో ఈ వేలం పాట నిర్వహిస్తున్నామని అని తెలిపారు

## కవి సమయం

### ఓటు రాజ్యము

దేవుని సంపద మనుష్యుల్లారా...
దప్పికి కరువు దేశం గాదా?
నడిపిన వారికి దయ వుండాలి?
ఎల్తిగ లేక నడపాలండి.
ఎప్పుడు పోవును పేదరికాలు?
తిప్పలు తోను జనులకు బతుకు
కడిగిన కొలది పేదలు హెచ్చు
తప్పవ యీ బతుకులు ప్రజలకు.
ఓటు రాజ్యము - ధరలకు పెరుగు
ఏమికొందుమా - గుండెకు బెగులు
ఎట్లా... అంటే...?
కాదను కుంటే...?
అట్లా... అయితే..?
పని, పాట్లంతే?
ఐక్య వేదికలు పెడుతున్నా...
చర్చలతోనూ...
కాలయాపనా...
కాలం నడకలు కాలందే...
మాటలు, వరుసలు మాటలవే...
మారేదెప్పుడు మన చోట...
మారేదెప్పుడు పాలన బాట.
జనాలుతో... జగడమాడితే...?
గొప్పకాదురా?
ధరలను బాగ అదుపు చేయరా...
జనాలు మీకు పూజింతురు రా...

...కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు
సెల్ నెం: 9290839512

## పంచాంగం

మాసం : పుష్య; తిథి : ద్వాదశి రా.8.24; మూల్య రా.10.39; ఉ.శే.వ.7.23వ రా.వ.8.57ల 10.39.

శుక్రవారం 01 -02 -2019

**మేషం:** ప్రేమికుల మధ్య నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఎప్పటి నుంచో వాయిదా పడుతున్న వస్తున్న పనులు పునఃప్రారంభించాలనే ఆలోచన స్ఫురిస్తుంది. **వృషభం :** ఆకస్మిక ఖర్చులు ఆందోళన కలిగిస్తాయి. నిరుద్యోగులకు కీలకమైన వ్యవహారాలలో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. స్త్రీలకు వాహనం నడుపునపుడు మెళకువ అవసరం. ఆడిటర్లకు, అకౌంట్స్ రంగాల వారికి పనిభారం అధికంగా ఉంటుంది. **మిథునం :** చిన్నతరహా పరిశ్రమలలో వారికి శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. క్రయ విక్రయాలు సామాన్యం. మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. ఖర్చులు పెరగటంతో రుణ యత్నాలు, చేబదుళ్లు స్వీకరిస్తారు. **కర్కాటకం :** ప్రణాళికా బద్ధంగా వ్యవహరించి అనుకున్నది సాధిస్తారు. అనుకోకుండా ఏర్పడిన ఒక స్నేహబంధం భవిష్యత్‌లో మీకు మంచే చేస్తుంది. సంతానం విద్య, ఆరోగ్యం పట్ల శ్రద్ధ కనబరుస్తారు. ఖర్చులు సామాన్యం. **సింహం :** మొండి బాకా యిలు వసూలు కాగలవు. అనుకున్న పనులు కొంత ముందు వెనుకలుగనైనా సంతృప్తి కరంగా పూర్తి చేస్తారు. వస్త్రాలు, విలువైన వస్తువులు సమకూర్చు కుంటారు. కుటుంబ విషయాలు, ఆర్థిక లావాదేవీలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. **కన్య :** నిరుద్యోగుల ఆలోచనలు ఉపాధి పథకాల దిశగా సాగు తాయి. అనుకున్న పనులు కొంత ముందు వెనుకలుగానైన సంతృప్తి కరంగా పూర్తి చేస్తారు. పత్రిక, ప్రైవేటు సంస్థలలో వారికి మార్పులు అను కూలిస్తాయి. **తుల :** దూర ప్రయాణాలలో మెళకువ అవసరం. తలపెట్టిన పనుల్లో ఒకింత జాప్యం, చికాకు తప్పదు. స్త్రీలు షాపింగ్ వ్యవహారా లలో అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్త అవసరం. ఆత్మీయుల నుంచి సహాయాన్ని పొందుతారు. **వృశ్చికం :** విద్యార్థులు అతి కష్టం మీద పై చదువులకు అవకాశం లభిస్తుంది. మీ సంతానం భవిష్యత్ గురించి కొత్త కొత్త ప్రణాళికలు రూపొందిస్తారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సంతృప్తి, పురోభి వృద్ధి. చేతి వృత్తుల వారికి ఓర్పు, నేర్పు ఎంతో అవసరం. నూతన పరిచయాలు ఏర్పడతాయి. **ధనుస్సు :** వాహనం నడుపునపుటలో మెళకువ అవసరం. రాజకీయ నాయకులకు పదవి సమస్యలు అధికమవుతాయి. మిత్రుల సహకారంచో ఓ సమస్యను సునాయాసంగా పరిష్కరిస్తారు. కంప్యూటర్ రంగాల వారికి పురోభివృద్ధి. ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాలు, వాణిజ్య ఒప్పందాల్లో మెళకువ వహించిండి. **మకరం :** సోదరీ, సోదరుల మధ్య ఆస్తి విషయాలు గూర్చి తగాదాలు రావచ్చు. దైవ కార్యాలలో పాల్గొంటారు. రావలసిన ధనం చేతికందకపోవడంతో రుణం తీర్చాలనే మీ యత్నం నెరవేరగలదు. నిరుద్యో గులకు ఎప్పటి నుంచో వాయిదా పడుతూ వస్తున్న పనులు పునః ప్రారం భించాలనే ఆలోచన స్ఫురిస్తుంది. **కుంభం :** కీలకమైన వ్యవహారాలలో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. గృహంలో శుభకార్యం చేయాలనే ఆలోచన స్ఫురిస్తుంది. స్త్రీలు అదనపు సంపాదన దిశగా ఆలోచన చేస్తారు. **మీనం :** కొత్తగా చేపట్టిన వ్యాపారాల్లో క్రమేణా నిలదొక్కుకుంటారు. ప్రముఖులతో ముఖ్య వ్యవహారంపై సంప్రది ంపులు జరుపుతారు. రుణ యత్నాల్లో ఆటంకాలు తొలగిపోతాయి. రావలసిన ధనం చేతికందుతుంది. గృహంలో దైవ కార్యక్రమాలుచేయుట వంటి శుభ పరి ణామాలు ఎదుర్కుంటారు. స్త్రీలకు పనిభారం అధికం.

## సంకీర్తన

## అదే సుబ్రహ్మణ్యస్వామి మహిమ!



భక్తుల కోరికలను నెరవేర్చడం కోసం సుబ్రహ్మణ్య స్వామి వివిధ ప్రదేశాల్లో అవతరించాడు. అలాంటి విశిష్టమైన క్షేత్రాల్లో ఒకటి అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం 'కోటంక' గ్రామంలో దర్శనమిస్తుంది. ఇక్కడి సుబ్రహ్మణ్య స్వామి మహి మాన్వితుడని భక్తులు విశ్వసిస్తుంటారు. ఇక్కడ స్వామి స్వయంభువుగా వెలిశాడనీ .. పూర్వం స్వామి సర్ప రూపంలో మహర్షులకు దర్శనమిస్తూ వుండేవాడని చెబుతుంటారు.

ఇక్కడ స్వామివారి సన్నిధిలో పాతాళగంగ వుంది. ఆనాటి నుంచి ఈనాటి వరకూ ఇందులోని నీటి ధార తగ్గకపోవడం విశేషంగా చెప్పుకుంటూ వుంటారు. ఇది స్వామివారి మహిమగా విశ్వసిస్తూ వుంటారు. ఈ నీటిని స్వామివారి అభిషేకానికి ఉపయోగిస్తారు. పాతాళ గంగలోని నీటిని తీర్థంగా స్వీకరించడానికి భక్తులు మరింత ఆసక్తిని చూపుతారు.

ఈ నీటిని తీర్థంగా స్వీకరించడం వలన, దీర్ఘకాలిక వ్యాధులు తగ్గుముఖం పడతాయని అనుభవపూర్వకంగా చెబుతుంటారు. వివాహం విషయంలోను .. సంతాన భాగ్యం విషయంలోను ఆలస్యమవుతున్నప్పుడు, ఈ స్వామిని దర్శించుకుని మనసులో మాట చెప్పుకుంటే ఆ కోరిక నెరవేరుతుందని అంటారు. ఈ క్షేత్రంలో అడుగుపెట్టడం వలన సమస్త దోషాలు తొలగిపోతాయనీ, పుణ్యఫలాలు చేకూరతాయని చెబుతారు. విశేషమైన పర్వదినాల్లో స్వామివారిని దర్శించుకునే భక్తుల సంఖ్య ఎక్కువగా వుంటుంది. ఆహ్లాదకరమైన ఈ క్షేత్రాన్ని దర్శించడం వలన మనసుకు ఎంతో ప్రశాంతత లభిస్తుంది.

### శివలింగారాధన ఫలితం!

పరమశివుడు లింగరూపంలో ఆవిర్భవించి, భక్తులచే పూజాభిషేకాలు అందుకుంటున్నాడు. శివలింగారాధన వలన విశేషమైన ఫలితాలు కలుగుతాయని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. బంగారం .. వెండి వంటి లోహపదార్థాలతో తయారు చేయబడిన శివలింగాలను, బాణలింగం .. స్పటిక లింగం వంటి వాటితో రూపొందించబడిన శివలింగాలను పూజించడంవలన విశేషమైన ఫలితాలు కలుగుతాయని చెప్పబడుతోంది. మట్టితోను .. వెన్నతోను .. పిండితోను ఇలా వివిధ రకాల పదార్థాలతో తయారుచేయబడిన శివలింగాలను ఆరాధించడం వలన, పుణ్యరాశి పెరుగుతుంది. మనసులోని కోరికలను బట్టి ఆయా శివలింగ రూపా లను పూజించవలసి వుంటుంది. సాధా రణంగా చాలామంది ఆరోగ్యాన్ని .. ఐశ్వ ర్యాన్ని కోరుకోవడం జరుగుతూ వుంటుంది. ఆనందకరమైన జీవితాన్ని గడపడానికి ఐశ్వర్యం .. ఆరోగ్యం రెండూ అవసరమే. అందువలన వాటిని కోరుకోవడం జరుగుతూ వుంటుంది.'పటిక బెల్లం'తో తయారు చేయబడిన శివలింగాన్ని పూజించడం వలన, ఆరోగ్యం కలుగుతుందని చెప్పబడుతోంది. ఇక ఐశ్వర్యాన్ని కోరుకునేవారు 'కపిల గోవు' పేడతో చేసిన శివలింగాన్ని ఆరాధించవలసి ఉంటుంది. అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ శివలింగాలను పూజించడం వలన, ఆశించిన ఫలితం తప్పక లభిస్తుందని స్పష్టం చేయబడుతోంది.



రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 విజయభాను క్లాసిఫైడ్స్ Minimum 7 days సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# సారా అమ్మకాలపై ప్రత్యేక నిఘా

## - నర్సీపట్నం ఎక్సైజ్ సీఐ రాజు



మాకవరపాలెం ; గ్రామాల్లో సారా తయారీ, అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు నర్సీపట్నం ఎక్సైజ్ సీఐ రాజు అన్నారు. మాకవరపాలెం మండలం పైడిపాలలో ఎక్సైజ్ అధికారులు సారా అమ్మకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ రాజు విలేకరులతో మాట్లాడుతూ పైడిపాలకు చెందిన నలుగురు తయారీ దారులు, ఆరుగురు అమ్మకందారులు ఎక్సైజ్ అధికారుల ఎదుట లొంగిపోయినట్లు తెలిపారు. మరో ముగ్గురు అనుమానితులు పరారీలో ఉన్నారని, వారికోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. సారా రహిత జిల్లాగా కొనసాగేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. భవిష్యత్‌లో సారా అమ్మకాలు, తయారీ చేపడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా లొంగిపోయిన పలువురిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



37వవార్డు పరిధి రాంజీ ఎస్టేట్ గ్రామములో ఎన్టీఆర్ సేవ సమితి, ఎంపీఎం ట్రస్ట్ మరియు 37వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు రాష్ట్ర గొర్రెల మేకల ఫెడరేషన్ డైరెక్టర్ గంకల అప్పారావు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. ఈ కార్యక్రమమునకు గీతం యూనివర్సిటీ అధ్యక్షులు ఎం.శ్రీ భరత్ ముఖ్యఅతిధిగా విచ్చేసారు. ఈ సందర్భంగా గంకల అప్పారావు మాట్లాడతూ డా. ఎంవిఎస్.మూర్తి ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యంగా భావించి ఎందరో నిరుపేదలకు ఆరోగ్యంగా ఉండేందుకు గీతం వైద్యశాల పెట్టి ఉచిత మెగా వైద్యం అందచేస్తున్న మహానుభావుడు అని వారి అడుగుజాడలలో వారి మనవడు ఎం. శ్రీ భరత్ కూడావారి అడుగుజాడల్లోనే నడవడం సంతోషకరంగా ఉందని, కాబట్టి ప్రజలందరూ వారి కుటుంబానికి కృతజ్ఞతతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని రకాల రోగాలకు సంపాదించిన డాక్టర్లు సిబ్బంది అధిక సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైద్య రంగానికి ఇగ్నో చేయూత

## - నాలుగు కొత్త కోర్సుల ప్రారంభం

విశాఖపట్నం : దరఖాస్తులకు చివరితేదీ ఫిబ్రవరి 11 వరకూ పొడిగింపు వైద్య ఆరోగ్య విభాగంలో నాలుగు కొత్త సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభం భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సహకారంతో రూపకల్పనఅడ్మిషన్ల చివరి తేదీ ఫిబ్రవరి 11, 2019 వరకు పొడిగింపు ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) వైద్య, ఆరోగ్య విభాగానికి సంబంధించిన కొత్త కోర్సులు నాలుగింటిని ప్రారంభించింది. భారత ప్రభుత్వ ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సహకారంతో వైద్య, ఆరోగ్య రంగాల్లో నైపుణ్యంగల మానవ వనరుల్ని సిద్ధంచేసే ఉద్దేశ్యంతో ఇగ్నో ఒక నైపుణ్య శిక్షణా కేంద్రం ఏర్పాటు చేసి మొదటి విడతగా ఈ నాలుగు కోర్సుల్ని సిద్ధం చేసింది. ఈ కోర్సులు - సర్టిఫికెట్ ఇన్ జనరల్ డ్యూటీ అసిస్టెన్స్, జరియాట్రిక్ కేర్ అసిస్టెన్స్, ఫ్లెబాటమీ అసిస్టెన్స్ మరియు హోమ్ హెల్త్ అసిస్టెన్స్. వీటిల్లో సర్టిఫికెట్ ఇన్ జనరల్ డ్యూటీ అసిస్టెన్స్, సర్టిఫికెట్ ఇన్ హోమ్ హెల్త్ అసిస్టెన్స్ కోర్సులలో చేరడానికి ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన పరీక్ష పాసైన వారందరూ అర్హులే. అలాగే సర్టిఫికెట్ ఇన్ జరియాట్రిక్ కేర్ మరియు సర్టిఫికెట్ ఇన్ ఫ్లెబాటమీ అసిస్టెన్స్ కోర్సులకి సైన్సులో ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన పరీక్ష పాసైనవారు అర్హులు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ కోర్సుల్ని చేసి వైద్య ఆరోగ్య రంగంలో ముఖ్యంగా వివిధ ఆస్పత్రులలో ఉపాధి పొందే వీలుంది. ఈ కోర్సుల్ని దేశవ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలలు, జిల్లా ఆస్పత్రుల సహకారంతో ఇగ్నో ప్రాంతీయ కేంద్రాలద్వారా అందిస్తారు. వైద్య ఆరోగ్య రంగంలో పనిచేస్తున్న, ఉపాధి పొందాలనుకునే వారిలో నైపుణ్యాలను పెంచి, గ్రామీణ ప్రాంతాలకూ అన్ని రకాల మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రారంభమయిన ఈ కోర్సులు విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలో నూ అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులతో పాటు మిగిలిన అన్ని ఇగ్నో కోర్సులలో నూ చేరదలిచిన ఆసక్తి గల విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలోని అభ్యర్థులు ఆన్లైన్ విధానంలో కింద ఇవ్వబడిన లింక్ క్లిక్ చేసి ఫిబ్రవరి 11వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.మరింత సమాచారంకోసం ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రాన్ని గానీ, ఇగ్నో అధ్యయన కేంద్రాల్ని గాని సంప్రదించవలెను.

# గవర కార్పొరేషన్ ఏర్పాటుపై సీతారాం హర్షం



అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం గవర కులస్థుల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారాం హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన కార్యాలయం నుంచి ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్న గవర సోదరులకు ఇది ఒక తీపి కబురు అన్నారు. జనాభా పరంగా కొన్ని తప్పుడు నివేదికలు అందినా, వాటిని పక్కకు నెట్టి నిజమైన సర్వేతో కార్పొరేషన్ ఏర్పాటుకు మంజునాథన్ కమిషన్ అందించిన తోడ్పాటు మరువలేనిదని చెప్పారు. సంఖ్యా పరంగా బలంగా ఉన్నప్పటికీ ఆర్థికంగా వెనుక బాటు తనం ఉందని తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటు కారణంగా అన్ని విధాలా నిలదొక్కుకునే అవకాశం ఉందని ఆశా భావం వ్యక్తం చేశారు.

ఏమైనా గవర కార్పొరేషన్ ఏర్పాటు విషయంలో ప్రభుత్వ చర్యలు ఆనంద దాయకమని సీతారాం ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# 51వ రోజుకు చేరిన దీక్షలు



అనకాపల్లి : అనకాపల్లి మండలం టి. వెంకుపాలెం గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 67,68 లో గల భూమిలో సాగు రైతులకు పరిహారం చెల్లించాకే భూములు సేకరించాలనే డిమాండ్ తో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారాం చేపట్టిన రిలే దీక్షలు గురువారం నాటికి 51 వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతులు పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు న్యాయం చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. జనసేన పార్టీ నేత కొణతాల సీతారాం ఆధ్వర్యంలో ఎంతటి పోరాటం చేయడానికైనా తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు షేక్ ఉమర్, దాడి బుజ్జి, రాజనాల శ్రీకాంత్ తదితరులు, పాము పైడిరాజు, గల్లా వినోద్, మళ్ల రాజా, రైతులు కుండల లోవరాజు, ఉరుకూటి అప్పారావు, బోర రాజు, ఉరుకూటి బాబూరావు, ఉరుకూటి సింహాద్రి పాల్గొన్నారు.

## తహశీల్దార్ కార్యాలయం ఎదుట

# చిన్నగుమ్ములూరు రైతుల నిరసన

ఎస్.రాయవరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద చిన్న గుమ్ములూరు రైతులు నిరసన తెలిపారు. పెదగుమ్ములూరు రెవెన్యూ పరిధిలో పలువురు రైతులకు సంబంధించిన భూమిని 22ఎ రికార్డులో పెట్టడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తమ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎప్పటినుంచో తాము భూమి సాగు చేస్తున్నామని, అయితే ఆ భూమిని ఎటువంటి అమ్మకాలు, కొనుగోలు జరగకుండా 22ఎ లో పెట్టడం గల కారణం ఏమిటి అని రైతులు ప్రశ్నించారు. వీరికి మాజీ ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మద్దతు పలికారు. స్థానిక తహశీల్దార్ కోరాడ వేణుగోపాల్‌ను కలిసి రైతుల సమస్య మాజీ ఎమ్మెల్యే బాబూరావు చర్చించారు. సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు మధువర్మ, పుట్టా సుధాకర్, పాండురంగ వర్మ, గాడి బుజ్జి, సింహాద్రి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మల్కాపురం సిఐ భాస్కరరావుకు అభినందనలు తెలిపిన పెద్దిరెడ్ల నానాజీ



మల్కాపురం(ములగాడ): మల్కాపురం పోలీస్ స్టేషన్ నూతన బాధ్యతలు చేపట్టిన సిఐ లంక భాస్కరరావుకు పశ్చిమ నియోజక వర్గ బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు పెద్దిరెడ్లనానాజీ అభినందనలు తెలిపారు అనంతరం నానాజీ సీఐ తో మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో పలు సమస్యల పైన మరియు ఎక్కువ రద్దీగా ఉండే ప్రాంతాలు మల్కాపురం త్రినాధ పురం ప్రకాష్ నగర్ జయంద్రి కొనలి శ్రీహరిపురం కోరమండల్ వాణిజ్య సముదాయం నందు ఎక్కువ జన సంచారం వీటిపై దృష్టి సాధించాలని కోరారు. సీఐ భాస్కర్‌రావు ఆయన చెప్పిన వాటికి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు యువకులు పాల్గొన్నారు.

## ప్రశాంతి పాలిటెక్నిక్‌లో

# అవగాహన సదస్సు




అచ్యుతాపురం : స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం వ్యక్తిత్వం-వికాసం పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన నన్నయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య ముర్తు ముత్యాలనాయుడు మాట్లాడుతూ విద్యార్థులు వారి తల్లిదండ్రుల, గురువుల సూచనలు సలహాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంతి పాలిటెక్నిక్ విద్యాసంస్థల అధినేత ధర్మిరెడ్డి ప్రసాద్ ,ప్రిన్సిపల్ కె శ్రీనివాసురావు ,స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఒ ఆర్ ఆర్ సి ప్రసాద్, కళాశాల అధ్యాపకులు ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పరవాడలో బూత్ కమిటీ సమావేశం



పరవాడ : పరవాడ వైస్సార్సీపీ కార్యాలయంలో గురువారము వైస్సార్సీపీ బూత్ కమిటీ కన్వీనర్లు, ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా వైస్సార్సీపీ పెందుర్తి సమన్వయకర్త అన్నంరెడ్డి అదీపరాజ్, సి.ఇ.సి సభ్యులు పైల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు సిరిపురపు అప్పల నాయుడు, చుక్క రామునాయుడు హజరైనారు. అనంతరము అతిధులు మాట్లాడుతూ రానున్నరాజ్యం జగన్ అన్నరాజ్యమని ప్రతి కార్యకర్త పార్టీకోసం కష్టించి పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలోచల్లా కనకారావు, సీతారామయ్య, పెదిశెట్టి శేఖర్,బొద్దపు చిన్నారావు,వెన్నెల సన్యాసిరావు,గెడ్డం ఉమా, నరేష్, బురద రాజు,భూస రాజు, తాతజీ, మసేను, గోవింద్,రాజశేఖర్, బొండా కనకారావు, పల్లా అప్పారావు, బండారు రామారావు తదితరులు పాల్గొన్నారు.

# పరవాడలో శోభారాణికి సన్మానం



పరవాడ: మండలకేంద్రమైన పరవాడ బాలుర హైస్కూల్‌లో సోషల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కడియాల శోభారాణికి సన్మాన సభ కార్యక్రమం జరిగింది. స్కూల్ ప్రధానోపాధ్యాయులు సురేఖ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా పరవాడ ఎంపిటిసి సభ్యులు పైల శ్రీనువాసురావు, తాజా మాజీసర్పంచ్ చుక్క రామునాయుడు, స్కూల్ కమిటీ ఛైర్మన్ పైల హరేష్, పైల సన్యాశిరావు మాష్టర్ హజరైన్నారు. ముందుగా వాళ్ళుచేతులు మీదుగా సన్మాన కార్యక్రమం చేశారు. అనంతరము అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు అందరినీ క్రమశిక్షణగా చూసుకోవడము, తన మన భేదం లేకుండా విద్యార్థులుందరికీ విద్యాబుద్ధులు నేర్పిన ఘనత కడియాల శోభారాణికే దక్కితుందని అన్నారు.

# మహాత్మాగాంధీ మార్గాన్ని అనుసరించాలి




విశాఖపట్నం : డాబాగార్డెన్స్ ప్రేమసమాజం మినీ సమావేశ మందిరంలో మహాత్మాగాంధీ వర్ధంతి మరియు లెప్రసీ వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినాము. సమైక్యతకు చిహ్నంగా డి.సత్యనారాయణ మూర్తి మౌలానా మహమ్మద్ మిన్హాజ్ రాజా ఖాద్రి, బిషప్ డా ఎలీషా పీటర్ ముగ్గురు కలిసి జ్యోతిని వెలిగించి మహాత్మగాంధీ వర్ధంతిని ప్రారంభించారు. అనంతరం అతిథులుగా విచ్చేసిన వారు ప్రసంగిస్తూ అహింసా మార్గంలో నడిచి మహాత్మాగాంధీ మార్గాన్ని అనుసరిస్తూ మహాత్ముని ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ జీవించాలన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యంను సంపాదించడంలో మహాత్మా గాంధీ చేసిన సేవలను శ్లాఘించారు. క్రమం తప్పకుండా మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహిస్తూ మహాత్ముని ఆశయాలతో ప్రేమ సమాజాన్ని నడిపిస్తున్న కమిటీ సభ్యులను ప్రశంసించారు. ప్రేమ సమాజం అధ్యక్షులు కంచర్ల రాంబ్రహ్మం మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఆశయాలతో ప్రేమ సమాజంలో ఆశ్రయం పొందుతున్న వారందరికీ విభిన్న రీతుల్లో సేవా కార్యక్రమాలు చేపడుతూ వారి ఉన్నతికి కృషి చేస్తున్నామని తెలిపారు. దాతల సహకారంతో ప్రేమసమాజం నడుస్తుందని తెలిపారు. సంస్థ గౌరవ కార్యదర్శి మట్టపల్లి హనుమంతరావు ప్రేమసమాజం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను తెలిపారు. ఉదయం ప్రేమసమాజం బాలబాలికలతో ప్రభాత భేరి నిర్వహించినాము. ఎవిఎన్ కాలేజీ దరి కుష్టు శరణాలయంలో ఆశ్రయం పొందుతున్న వారందరికీ అతిథుల చేతులమీదుగా నగదు బహుమతి అందజేశారు.

ఈ కార్యక్రమంలో ప్రేమసమాజం ఉపాధ్యక్షులు బుద్ధ శివాజీ, డా పి.విశ్వేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి కె.జగదీష్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, కార్యవర్గసభ్యులు, ప్రేమసమాజం బాలబాలికలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 10 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ



భీమునిపట్నం : భీమిలి గంటా క్యాంపు కార్యాలయంలో గురువారం భీమిలి, తగరపువలస ఏరియాల బూత్ కన్వీనర్లు మరియు ఏరియా కోఆర్డినేటర్లకు సమావేశంలో భీమిలి నియోజకవర్గ ఇంచార్జీ చిక్కాల విజయ్ బాబు పాల్గొన్నారు. అనంతరం అదరణ-2 లో 10 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎల్ డీఏ చైర్మన్ గాడు వెంకటప్పుడు, భీమిలి డివిజన్ ప్రెసిడెంట్ గంటా నూకరాజు, తగరపువలస డివిజన్ ప్రెసిడెంట్ కొప్పల రమేష్ , నాయకులు గాడు సన్యాసినాయుడు, రవ్వ వెంకట్రావు, గురుమూర్తి రు, చిలక నర్సింగరావు గారు, బడిగంటి నీలకంఠం మరియు జోనల్ కమిషనర్, పి.దుర్గా ప్రసాద్ మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెల్ఫేర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా అహ్మద్



విశాఖపట్నం : వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా (డబ్ల్యూపిఐ) రాష్ట్ర అధ్యక్షు నిగా విశాఖకు చెందిన ప్రముఖ న్యాయవాది ఐ.ఎం. అహ్మద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్య క్షుడు డాక్టర్ ఎస్.క్యూఆర్. ఇలియాస్ నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. న్యాయవాది అహ్మద్ మాట్లా డుతూ రాబోవు పార్లమెంటు శాసనసభ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పార్టీ అభ్యర్థులు పోటీ చేయనున్నారన్నారు.

# మహోదయ పురస్కరించికొని సమీక్షా సమావేశం



భీమునిపట్నం : భీమిలి నియోజకవర్గ ఇంచార్జీ విజయ్ బాబు అధ్వర్యంలో 4వ తేదీన జరుగనున్న మహోదయ పుణ్య స్నానాలు కొరకు అధికారులు మరియు స్థానిక నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం గోడ పత్రికను ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎల్ డీఏ చైర్మన్ గాడు వెంకటప్పుడు, భీమిలి డివిజన్ ప్రెసిడెంట్ గంటా నూకరాజు, తగరపువలస డివిజన్ ప్రెసిడెంట్ కొప్పల రమేష్ , భీమిలి మండల పార్టీ అధ్యక్షుడు డిఏఎన్ రాజు, జోనల్ కమిషనర్ పి.దుర్గాప్రసాద్, ఇ.ఇ, డి.ఈలు, ఎసిపి హరిబాబు, పి.యోగి, ఎం సంజీవ్ కుమార్, గిడుతూరి శ్రీనివాసరావు, కె.ఎస్.ఆర్. కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ-విశాఖ ఫాస్ట్ ప్యాసింజర్ రైలులో

# 'టాయిలెట్స్ బోగీలు' కల్పించాలి



అన్నవరం: 2003లో 15ఏళ్ళ క్రిందట బండారు. దత్తాత్రేయ రైల్వేమంత్రిగా వున్న ఎన్డీఏ ప్రభుత్వ హయాం లో అప్పటి మున్సిపల్ కౌన్సిల్ ద్వారా ప్రజాహిత ఉద్యమం తో కాకినాడ విశాఖ ఫాస్ట్ ప్యాసింజర్ రైలుకి టాయిలెట్స్ భోగీలు ఏర్పాటు సాధించు కున్నామని కాని నేడు అదే రైలుకి టాయిలెట్స్ లేని భోగీలతో నడుపుతుండడం అత్యంత దురదృష్టకరమని కాకినాడ ప్రజాసంక్షేమసంఘం అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెల్లవారుజామున కాకినాడ నుండి, సాయంత్రం విశాఖ నుండి బయలుదేరే ఈ ఫాస్ట్ ప్యాసింజర్‌ని అత్యధికంగా రైలుప్రయాణీకులు వినియోగించుకుంటారని టాయిలెట్స్ లేకపోవడం వలన మహిళలు వృద్దులు పిల్లలు దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న దుస్థితి మరలా తయారయ్యిందని రమణ రాజు పేర్కొన్నారు.

గడచిన ఆరు నెలలుగా టాయిలెట్స్ లేనిభోగీలతో నడుపుతున్నారని ఈవిధానం మంచిదికాదన్నారు. ఏ స్టేషన్ లోనూ 2నిమిషాలు కంటే ఎక్కువ సమయం హాల్టు వుండదని ప్రయాణంలో అత్యవసరం బట్టి కాలకృత్యాలు తీర్చుకోవడానికి తగిన వెసులుబాటు లేకపోవడం వలన ప్రయాణీకులకు శాపంగా మారిందన్నారు. ఆధునిక నగరాల్లో వాడి తీసేసిన డెమో రైళ్ళను ఇక్కడ ప్రవేశపెట్టడం వలన తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. రైల్వే బోర్డులో పరపతి కలిగిన ఇతర రాష్ట్రాల నేతలు అక్కడి ప్రయాణీకుల అవసరాలు తీర్చడానికి గాను ఇక్కడి టాయిలెట్స్ భోగీలు తరలించుకుపోవడాన్ని మించిన అన్యాయం మరొకటి వుండదన్నారు. కాకినాడ విశాఖ ఫాస్ట్ ప్యాసింజర్ రైలు ప్రయాణం అయిదు గంటలు పడుతుందని మహిళలు పిల్లలు వృద్దులు దివ్యాంగులు అత్యవసరమయిన పరిస్తితుల్లో మూత్ర, మల విసర్జనకు నానా అగచాట్లుపడుతున్న దుస్తితి వుందన్నారు. అత్యవసరమయ్యి మూత్ర మల విసర్జన కోసం మధ్య స్టేషన్లో దిగిపోవడం వలన రైలుప్రయాణీకులు తమ గమ్యాలకు చేరుకోవడంలో తీవ్ర ప్రతిభందకాలు ఏర్పడుతున్న విషయాన్ని ప్రభుత్వాలు ఉన్నతాధికారులు, పాలకులు గుర్తెరగాలని కోరారు.

టాయిలెట్స్ భోగీలతో కాకినాడ విశాఖ ఫాస్ట్ ప్యాసింజర్ రైలు నడిపించే చర్యలు తీసుకోవాలని రమణరాజు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో న్యూఢిల్లీలోని రైల్వే బోర్డ్ మంత్రిత్వ కార్యాలయం వద్ద' టాయిలెట్ బకెట్లు 'చీపుర్లతో ప్రజాసంక్షేమ సంఘం బృందం తరలివెళ్ళి నిరశన ఆందోళన చేపడతామని రమణరాజు హెచ్చరించారు.

## ఎపిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నవీన్ రాజ్



కాకినాడ : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షు డుగా విశాలాంధ్ర స్టాఫ్ రిపోర్టర్ వాతాడ నవీన్ రాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుపతిలో ఈనెల 28,29 తేదీల్లో జరిగిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభల్లో నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కమిటీలో తూర్పుగోదావరికి మూడు పదవులు దక్కాయి. ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న నవీన్ రాజ్ ఈసారి రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎన్నికయ్యారు. నవీన్‌రాజ్ ప్రస్తుతం ఎన్ఎజె జాతీయ కార్యదర్శిగా కొన సాగుతున్నారు. అలాగే ఫెడరేషన్ జిల్లా కార్య దర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా జర్నలిస్టులకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందించడంలో విశేష కృషి చేశారు. జర్నలిస్టుల పక్షాన అనేక పోరాటా లు చేశారు. ఆయనతో పాటు రాష్ట్ర కోశాధికారి గా మట్టపర్తి శ్రీనివాస్ (సాక్షి) కార్యవర్గసభ్యునిగా హరి ప్రసాద్ (విశాఖ సమాచారం) నియమితు లయ్యారు. ఫెడరేషన్ మహాసభల్లో జిల్లాకు సముచిత స్థానం లభించింది. తూర్పుగోదావరి జిల్లా యూనిట్ చేస్తున్న జర్నలిస్ట్ సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర మహాసభ ప్రశంసించింది. తూర్పుగోదావరి నుండి ఎన్నికైన ముగ్గరుని నూతన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శిలు ఎస్ వెంకట రావు, జి.ఆంజనేయులు, జిల్లా అధ్యక్ష కార్యదర్శి ఏలియా,సలీం అభినందించారు .

## వ్యక్తిత్వ నైపుణ్యం పెంచుకోండి

పెద్దాపురం: బాలికలు చదువుతో పాటు వ్యక్తిత్వ నైపుణ్యతను కూడా పెంచుకోవాలసిన ఆవశ్యకత ఎంతైన కలదని ఇసిపిఎస్ ప్రాజెక్టు అధికారి వెంకట తెలిపారు. స్థానిక సాగర్ మహిళ డిగ్రి కళాశాలలో బుధవారం ఐసిడిఎస్, ఇసిపిఎస్ ఆధ్వర్యంలో కిశోర్ వికాశం పేజ్-2 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి ఎం. విజయలక్ష్మీ, ఎఎస్పై రమణ న్యాయవాది విశాలాక్షి, కళాశాల డైరెక్టర్ దేవి, ప్రిన్సిపాల్ అచ్యుతరామయ్య, ఎస్ఆర్ఆర్ బిఎస్ఆర్ కళాశాలలకు చెందిన అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏ.టి.ఎంలో నగదు మాయం



అరకులోయ: స్టేట్ బ్యాంకు ఏ.టి.ఎంలో 20 వేల రూపాయలు విత్ డ్రా చెయ్యగా కేవలం 8 వేల రూపాయలు మాత్రమే వచ్చి మిగత 12 వేల రూపాయలు రాలేదని అరకు లోయ నెలవడ్డీ వ్యాపారస్తుడు వైకుం ఠం అన్నారు. ఈ నగదు మాయమైన విషయం స్తానిక బ్యాంకు అధికారుల కు పిర్యాదు చెయ్యగా చూస్తామని చెప్పి ఎటువంటి స్పందన లేక పోవడం తో నిరాశకు గురయ్యి ఆవేదన చెందుతూ ఉన్నాని పత్రికల వారికి తెలిపారు.

## పెద్దాపురంలో వైకాపా ప్రచారం

పెద్దాపురం: పెద్దాపురం పట్టణం వరహాలయ్య పేట, నువ్వులగుంటవీధి, రజకులవీధి, తదితర ప్రాంతాలలో బుధవారం రాత్రి వైకాపా ఆధ్వర్యంలో రావాలిజగన్, కావాలి జగన్ కార్యక్రమము నిర్వహించారు. ఇంటింటికి వైపాకా కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు వెళ్ళి, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, రమేష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎంజీ రఫీ, ఎండి జానీ, కె. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## జలయజ్ఞంతో రైతులకు పుష్కలంగా నీళ్ల

### - వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కన్నబాబురాజు



యలమంచిలి: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక జలయజ్ఞం పథకం ద్వారా రైతులకు పుష్కలంగా సాగునీరు అందుతుందని అన్న దాతలకు ఎంతో మేలు జరుగుతుందని ఆ పార్టీ యలమంచిలి సమన్వయకర్త ఉప్పలపాటి రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. గురు వారం మున్సిపాలిటీలోని పెద్దపెల్లి, మంత్రి పాలెం మరియు పెద్దగొల్లలపాలెంల్లో రావాలి జగన్ - కావాలి జగన్ గ్రామం నిర్వహించారు. టీడీపీ నాయకులు స్వార్థం వల్ల పొలాలకు సాగు నీరుదించే చెరువులు కబ్జాలకు గురయ్యాయని కన్నబాబు ఆరోపించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే చెరువుల ఆక్రమణలు తొలగించి పూడికలు తీయించి సంవత్సరం పొడవునా సాగునీరందించే చర్యలు చేపడతా మన్నారు. భారీ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తామని చెప్పారు. పోలవరం సహా అన్ని ప్రాజెక్టులు పూర్తిచేసి రైతులకు లబ్ధిచేకూర్చడమే జగనన్న ధ్యేయమన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ప్రజలకు వివరించారు. డీసీసీబీ మాజీ ఛైర్మన్ సుకుమార్ వర్మ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పర్చడంతో బాటు పేద విద్యార్థులకు కేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్యనందిస్తారన్నారు. మధ్య పాన నిషేధం అమలు చేయడం జరుగుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొద్దపు యర్రయ్యదొర, బొద్దపు గోవిందు, బొద్దపు లక్ష్మీ, పోలరౌతు నర్సింగరావు, కడియం అప్పలరాజు, గొర్లె వెంకట్, గొర్లె నర్సింహమూర్తి నాయుడు, దేవల అప్పలరాజు, భరిణికల శ్రీను, ఆడబాల తలుపులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమాలు నిరోధానికి ఆహార భద్రత చట్టంకు ప్రచారం కల్పించాలి



విశాఖపట్నం : జాతీయ ఆహార భద్రత చట్టం ప్రాధాన్యత, సేవలు, రేషన్ వినియోగదారుల హక్కులు, బాధ్యతలు గురించి క్షేత్ర స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా అక్రమాలు నిరోధించవచ్చని రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ (వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖ), రాష్ట్ర వినియోగదారుల పరిరక్షణ మండలి సభ్యుడు డాక్టర్ పి.రామారావు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖ కార్యదర్శి ఇందర్‌దీప్ కంద్వల్ (న్యూ ఢిల్లీ)ను వారు కలసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఆహార భద్రత చట్టం సెక్షన్ 14 ప్రకారం కాల్ సెంటర్, హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. చట్టం అమల్లోకి వచ్చి అయిదేళ్లు దాటినా చట్టం అమలు, ఫిర్యాదుల స్వీకరణ, సమస్యల పరిష్కారం, పర్యవేక్షించడానికి నియమితులైన అధికారుల పేర్లు, హోదాలు, చిరునామాలు, ఫోన్, ఈ-మెయిల్ వివరాలు కల్గిన బోర్డులు ప్రజలకు కనిపించేలా జిల్లా, ఏఎస్‌వో, సర్కిలాఫీసులు, రేషన్ డిపో, తహశీల్దార్, ఆర్డీవో కార్యాలయాల వద్ద ఏర్పాటు చేయలేదన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడి ఏడాదిన్నర దాటినా నేటికీ మండలం, రేషన్ డిపో స్థాయిల్లో విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు కాకపోవడం విచారకరమన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్టతలో భాగంగా ఈ పోస్ పర్యవేక్షణకు కమిటీలు నియమించాలన్నారు. జాతీయ ఆహార భద్రత చట్టం సెక్షన్ 28 ప్రకారం సామాజిక తనిఖీ జరగాలని వారు డిమాండ్ చేశారు. రేషన్ షాప్‌ల రికార్డుల తనికీకి మాత్రమే సామాజిక తనికీ పరిమితం కాకుండా రేషన్ సరుకులు తీసుకోవడంలో వినియోగదారులు పడుతున్న బాధలు, ఎదురవుతున్న సమస్యలు, రేషన్ డీలర్ల నుంచి వినిపించే దూషణ భూషణలు, పథకం బలోపేతానికి తీసుకోవల్సిన చర్యలపై సూచనలు మొదలైన అనేక అంశాలపై ప్రజాభిప్రాయాన్ని సామాజిక తనికీలో భాగం చేయాలని వారు కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థ సిటిజన్ ఛార్టర్‌ను అమలు చేయాలని కాండ్రేగుల వెంకటరమణ, పి.రామారావు కోరారు. ఇందుకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖ కార్యదర్శి ఇందర్‌దీప్ కంద్వల్ సానుకూలంగా స్పందించి తగుచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

## ఎస్సీ ఎస్టీసెల్ డిఎస్పీగా :ఎ.బి.జి.తిలక్



కాకినాడ : తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ ఎస్టీ సెల్ డిఎస్పీగా అల్లు బాల గంగాధర్ తిలక్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో రాజమహేంద్రవరం, కాకి నాడ ఎస్సైగాను, ముమ్మిడివరం. రాజానగరం, కాకినాడ మెరైన్ స్టేషన్‌లలో సిఐగా పని చేసారు. అనంతరం కృష్ణ జిల్లా గుడివాడ సిఐగా పనిచేస్తూ పదోన్నతి పై మచిలీపట్నం ఎస్సీ ఎస్టీ సెల్ డిఎస్పీగా నాలుగు సంవత్సరాలు పని చేసారు.

## భీమిలి డివిజన్ 19వ వార్డ్‌లో నిన్ను నమ్మం బాబు



భీమునిపట్నం: భీమిలి డివిజన్ 19 వార్డ్ అధ్యక్షులు జగ్గారావు, జిల్లా బిసి సెల్ కార్యదర్శి కాసరపు.పెద ఎల్లాజీల ఆధ్వర్యంలో నిన్ను నమ్మం బాబు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పాత బస్సు స్టాండ్ వద్ద వున్న వై ఎస్ ఆర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడ నుండి ర్యాలీగా వార్డ్‌లో పర్యటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భీమిలి నియోజ కవర్గ సమన్వ యకర్త అక్కరమాని విజయనిర్మ ల మాట్లాడుతూ గత ఎన్నికల్లో డ్వాక్రా రుణాలు పూర్తిగా మాఫీ చేస్తామని హామీ ఇచ్చినటువంటి చంద్రబాబు డ్వాక్రా రుణాలు చేయడం మానేసి పసుపు కుంకం అని డ్వాక్రా మహిళలు మోసం చేయడానికి మరో మార్పు ఉన్న ట్టు కనిపిస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ సినియర్ నాయకులు కాకర్లపూడి వరహలరాజు, వైసిపి పట్టణ అద్యక్షులు అక్కరమాని. వెంకట రావు, రామసూరప్పడు. వాసుపల్లి. ఎల్లాజీరావు, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి రాంభుక్త. ప్రభాకర్ నాయుడు పార్టీ నాయుకులు కార్యకర్త లు పాల్గొన్నారు.



కొత్త ఉడా పార్కులో రూ. 33.50 కోట్లతో ఆకర్షణీయంగా అధునాతన పరికరాలతో తీర్చిదిద్దనున్నారు. జివిఎంసి కమిషనర్ హరినారాయణన్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు విదేశీ పర్యాటకుల ఆకర్షణకు ఈ నిర్ణయం తీసుకున్నారు. నగరానికి అందాలు అద్దడంతో వినూత్న నిర్మాణా నికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డి పోతనరెడ్డి, పీతల అమరేంద్ర, సిహెచ్. జి. రమేష్, జివిఎంసి కాంట్రాక్ట్ సిబ్బంది, చంద్రమౌళి, జి. అశ్వనీకుమార్, టి.వీరారెడ్డి, స్మార్ట్‌సిటీ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## డాక్టర్ ప్రత్యూష్‌కు జాతీయ అవార్డు



కాకినాడ : కాకినాడ జన్మభూమి పార్కు వద్ద ఉన్న అశ్విని మల్టి స్పెషాలిటీస్ ఫిజియోథెరపీ, రిహాబిలిటేషన్ వైద్య సంస్థ అధినేత డాక్టర్ ప్రత్యూష్ జలగం కు జాతీయస్థాయి అవార్డు లభించింది. ఇండియా అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్ 2019 సదస్సు విశాఖపట్నంలో గీతం మెడికల్ కళాశాలలో జరిగిన సందర్భంగా జాతీయస్థాయి అధ్యక్షుడు డాక్టర్ సంజీవ్ ఝా ఈ అవార్డును ప్రత్యూష్‌కు అందజేశారు. డాక్టర్ ప్రత్యూష్‌ను పలువురు వైద్యులతోపాటు ఆంధ్రప్రదేశ్ ఫిజియోథెరపిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మాధవి, కార్యదర్శి అప్పారావు తదితరులు ప్రత్యేకంగా ప్రశంసించారు.

## నిన్ను నమ్మం బాబు మరియు రావాలి జగన్ - కావాలి జగన్



విశాఖపట్నం: గురువారం సాయంత్రం 31 వ వార్డు రైల్వే న్యూ కోలని, రామాలయం వీధిలో వార్డు అధ్యక్షులు షేఖ్.జుబెర్ ఆధ్వర్యంలో 57,71,బూత్ లలో నిన్ను నమ్మం బాబు మరియు రావాలి జగన్ కావాలి జగన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు 31వ వార్డు అధ్యక్షులు షేఖ్.జుబేర్, అక్బర్, నాగమణి, సంపత్, మణికంఠ, లక్ష్మి, రమేష్, చోటి, పరిధ్, కిరణ్ రాజు, ఆళ్ళ.శివ గణేష్, రాయుడు శ్రీను, పి.మధులత నాయుడు, సాడి.పద్మా రెడ్డి, కె.వి.బాబా, బొడ్డేటి.నాగు,కట్టుమూరి.సతీష్ సి హెచ్.ఈశ్వర రావు, దుప్పల పూడి.శ్రీనివాస్, కె.పి.రత్నాకర్, బి.వై.రావు, రామలక్ష్మి, ఎన్.రవికుమార్, నంభాళ్ళ.ఈశ్వరరావు, కె.చిన్నా, పద్మ శేఖర్, బాబ్ జాన్, కాధర్, కుమార్, జి.కృపా, పి.పద్మ, అమ్మజీ, చిరంజీవి, కె.రమణమ్మ, తదితరులు పెద్దయెత్తున పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శి పదవీ విరమణ



కాత్రేనికొన : అధికారులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుందని కాత్రేనికొన జడ్పీటీసీ నాగిడి నాగేశ్వరరావు పేర్కొన్నారు చెయ్యేరు పంచాయ తీ కార్యదర్శి మొల్లేటి తిరుమల రావు పదవి విరమణ సందర్భంగా అభినందన సభ స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో గురు వారం జరిగింది ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొని యాడారు కాత్రేనికోన ఈవోపీఆర్డీ కె వెంక టేశ్వరరావు, గ్రామ కార్యదర్శిల ఆధ్వర్యంలో తిరుమ లరావును డోలు సన్నాయి మేళల తో తీసుకువచ్చారు వేద మంత్రాల సాక్షిగా తిరుమల రావును ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రమణ్య శర్మ ఎంపీపీ ఆకాశం సత్యనారాయణ మూర్తి , వ్యవసాయ అధికారి బి శ్రీ విద్య మండల పరిషత్ సుపరిటెండ్ కె వెంకటేశ్వరావు ఉపాధి హామీ ఏపీవో శర్మ సిబ్బంది జి వాసు భవాని శ్రీరామ్ బ్రహ్మాజీ నాగరాజు వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



విశాఖపట్నం: ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ గన్‌మెన్ (ఇన్‌సెట్‌లో) రాజబాబు రోడ్డు ప్రమాదంలో మృతి. పెందుర్తి నుండి సబ్బవరం జాతీయ రహదారిలో స్థంభించిన ట్రాఫిక్

## ఈబీసీ 10 శాతం రిజర్వేషన్ బిల్లు వెనక్కు తీసుకోవాలి

విశాఖపట్నం : ఆదిపత్య కులాల వారికి పదిశాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ కేంద్రప్రభుత్వం చేయబోతున్న రాజ్యాంగ సవరణను వ్యతిరేకిస్తూ ఎఐడిఆర్ఎఫ్, పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నగరం లోని ఎల్ఐసి దగ్గరగల అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. దేశవ్యాప్తంగా ఎఐడిఆర్ఎఫ్‌తో బాటు పలు కేంద్ర సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో ప్లకార్డులు ధరించి నిరసన వ్యక్తంచేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు నష్టం కలిగించే చర్యలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

# సాధువులారా.. రాముడు, కృష్ణుడు ధూమపానం చేయలేదు



ప్రయాగ్‌రాజ్: యోగా గురువు బాబా రాందేవ్ .. ప్రయాగ్‌రాజ్‌లో సాధువులను కలిశారు. అక్కడ జరుగుతున్న కుంభమేళాలో పాల్గొనేందుకు వెళ్లిన ఆయన వారితో ముచ్చటించారు. సాధువులెవరూ ధూమపానం చేయకూడదంటూ రాందేవ్ వారిని కోరారు. రాముడు, కృష్ణుడి బాటను మనం అనుసరిస్తున్నామని, వాళ్లెవ్వరూ ధూమపానం చేయలేదని, మనం కూడా ధూమపానం చేయకూడదని వాగ్ధానం చేయాలని అన్నారు. ఓ మంచి కారణం కోసం మనం మన ఇంటిని, తల్లితండ్రులను వదిలి వచ్చామని, అలాంటప్పుడు స్మోకింగ్‌ను ఎందుకు వదిలేయలేమన్నారు. కొందరు సాధువుల వద్ద ఉన్న ధూమపాన పైపులను తీసుకున్న బాబా రాందేవ్ వారితో ప్రతిజ్ఞ చేయించారు. తాను నిర్మించబోయే మ్యూజియంలో ఈ ధూమపాన పైపులను ప్రదర్శనకు పెట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఎంతో మంది యువత పొగాకు మానేలా చేశానని, సాధువులను కూడా దానికి దూరంగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నానని రాందేవ్ అన్నారు.

# అండర్‌కవర్ ఆపరేషన్.. పట్టుబడిన భారతీయులు

డెట్రాయిట్: గడువు తీరిన వీసాలతో, ఫేక్ స్టేటస్‌లతో అమెరికాలో తిష్టవేసినవారిని పట్టుకోవడం కోసం అక్కడి ఫేడరల్ ప్రభుత్వం భారీ స్టింగ్ ఆపరేషన్ చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో పట్టుబడింది ఎక్కువగా తెలుగు వాళ్లేనని తెలుస్తున్నది. దాదాపు 200 మంది ఏపీ, తెలంగాణ విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. అమెరికా హోమ్‌ల్యాండ్ పోలీసులు నిర్వహించిన అండర్‌కవర్ ఆపరేషన్‌లో 600 మంది భారతీయ విద్యార్థులు గడువు తీరిన వీసాలతో ఉన్నట్లు గుర్తించారు. నకిలీ వీసా కేసులో విద్యార్థులను అక్రమంగా తరలించిన 8 మంది మధ్యవర్తులను మిచిగన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా వీసా పొందుతున్న విద్యార్థులను పట్టుకునేందుకు అమెరికా పోలీసులు ఫర్మింగ్టన్ హిల్స్‌లో ఓ ఫేక్ వర్సిటీని క్రియేట్ చేసి వారికి వల వేశారు. 2015లో ఆ వర్సిటీని ప్రారంభించారు. వాస్తవానికి ఆ వర్సిటీ వెబ్‌సైట్‌లో తమ కాలేజీ ప్రభుత్వ గుర్తింపు పొంది ఉన్నట్లు ఉంది. కానీ హోమ్‌ల్యాండ్ పోలీసులు నకిలీ వీసా గుట్టుతేల్చేందుకు ఓ రహస్య ఆపరేషన్ కింద ఆ వర్సిటీని స్థాపించారు. వర్సిటీ ప్రారంభం అయిన రోజు నుంచి హోమ్‌ల్యాండ్ సెక్యూర్టీ ఏజెంట్లు వీసా ఫ్రాడ్‌కు పాల్పడుతున్న వారిని పట్టుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేపట్టారు. చివరకు ఈ కేసులో మొత్తం 8 మందిని అరెస్టు చేశారు. అరెస్టైన దళారీలు తెలుగువారే. కాకిరెడ్డి భరత్(ఫ్లోరిడా), కండాల సురేశ్(వర్జీనియా), కర్ణాతి ఫణిదీప్(కెంటకీ), రాంపీస ప్రేమ్(నార్త్ కరోలినా), సామ సంతోష్(కాలిఫోర్నియా), తక్కాలపల్లి అవినాష్(పెన్సిల్వేనియా), నూనె అశ్వంత్(అట్లాంటా), ప్రత్తిపాటి నవీన్(డల్లాస్)లు అరెస్టు అయిన వారిలో ఉన్నారు. ఈ ఎనిమిది మంది ప్రదానంగా విదేశీ విద్యార్థులకు అక్రమ పద్ధతిలో వీసాలు ఇప్పించినట్లు తేలింది. హోమ్‌ల్యాండ్ పోలీసులు చేపట్టిన రహస్య ఆపరేషన్ బయటకి రావడంతో.. అమెరికా తెలంగాణ సంఘం(ఆటా) అక్కడి విద్యార్థులకు వార్నింగ్ ఇచ్చింది. సుమారు వంద మందిని అరెస్టు చేశారని ఆ సంఘం పేర్కొన్నది. బాధిత విద్యార్థులను రక్షించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆటా తన ఫేస్‌బుక్ పేజీలో వెల్లడించింది. అమెరికాలో ఫేక్ ఏజెంట్లతో అప్రమత్తంగా ఉండాలని కూడా ఆటా తన పేజీలో భారతీయులను కోరింది. అరెస్టు అయిన 8 మంది.. అమెరికాకు సుమారు 600 మంది విద్యార్థులను ఆకర్షించినట్లు తేల్చారు.

# మధ్యాహ్న భోజనంలో పాము..



నాందెడ్ : విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనంలో పాము ప్రత్యక్షమైన ఘటన నాందెడ్‌లో వెలుగుచూసింది. గర్గావన్ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఇవాళ మధ్యాహ్నం విద్యార్థులకు కిచిడీ వడ్డిస్తుండగా..అందులో చనిపోయిన పాము కనిపించింది. దీంతో అంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. పాము కనిపించడంతో అప్రమత్తమైన సిబ్బంది వడ్డింపు ఆపేశారు. దీంతో విద్యార్థులకు ఎలాంటి హాని కలగలేదు. విద్యార్థుల కోసం చేసిన కిచిడీలో పాము ఉన్నట్లు గుర్తించిన వెంటనే భోజనం వడ్డన నిలిపేశామని నాందేడ్ డీఈవో ప్రశాంత్ డిగ్రాస్కర్ తెలిపారు. ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకుని, విచారణకు ఆదేశించామన్నారు. ఈ ఘటనకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మొత్తం 80 మంది విద్యార్థులు చదువుతున్నారు.

# 23 రోజులు అడవిలోనే..



తిరువనంతపురం : నేర చరిత్ర కలిగిన 21 ఏళ్ల యువకుడు మైనర్ బాలికతో 23 రోజుల పాటు దట్టమైన అడవిలో గడిపాడు. కేరళలోని ఇడుక్కి జిల్లాలోని కుమలి గ్రామానికి చెందిన మంజు(17) తల్లిదండ్రులు.. జార్జ్(21) అనే యువకుడిని కూలీగా పిలిపించుకున్నారు. ఈ క్రమంలో మంజు, జార్జ్‌కు మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దీంతో జనవరి 6వ తేదీన మంజును తీసుకొని జార్జ్ వెళ్లిపోయాడు. అదే రోజున మంజు అద ృశ్యమైనట్లు ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. జార్జ్, మంజు కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. జార్జ్‌పై గతంలోనే పోక్సో చట్టం కింద కేసులు నమోదైనట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇక మంజు మొబైల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పోలీసులు వారున్న ప్రాంతాన్ని గుర్తించినప్పటికీ అక్కడికి చేరుకోలేకపోయారు. 23 రోజుల పాటు వారి ఆచూకీ తెలుసుకోలేకపోయారు పోలీసులు.

ఈ 23 రోజులు జార్జ్, మంజు కలిసి అడవిలోనే గడిపారు. అడవిలో దొరికే దుంపలు, పండ్లు తింటూ జీవనం సాగించారు. రాళ్ల తొర్రల మధ్య నిద్రపోతూ ఉన్నారు. మంగళవారం ఈ ఇద్దరు అడవిలో దొరికన పండ్లను విక్రయించేందుకు అడవి నుంచి బయటకు వచ్చారు. దీంతో వారిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

# ఏప్రిల్ 2 నుంచి గూగుల్ ప్లస్ సేవల నిలిపివేత..!

సాఫ్ట్‌వేర్ సంస్థ గూగుల్ గతేడాది డిసెంబర్‌లో తన గూగుల్ ప్లస్ సేవలను నిలిపివేయనున్నట్లు ప్రకటించిన విషయం విదితమే. కాగా చెప్పినట్లుగానే గూగుల్ ఇకపై గూగుల్ ప్లస్ సేవలను నిలిపివేయనుంది. వచ్చే ఏప్రిల్ 2వ తేదీ నుంచి గూగుల్ ప్లస్ ఇక పనిచేయదు. అలాగే యూజర్లకు చెందిన గూగుల్ ప్లస్ అకౌంట్లు, వారు క్రియేట్ చేసిన పేజీలు, అందులో ఉండే కంటెంట్‌ను కూడా గూగుల్ డిలీట్ చేయనుంది. కానీ తమ సమాచారం కావాలనుకున్న వారు గూగుల్ ప్లస్‌లో నుంచి ఆ డేటాను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని గూగుల్ అందిస్తున్నది. కాకపోతే ఏప్రిల్ 2వ తేదీ వరకు మాత్రమే అందుకు అవకాశం ఉంటుంది. అయితే గూగుల్ ఫొటోస్‌లో బ్యాకప్ అయి ఉన్న ఫొటోలు, వీడియోలు మాత్రం డిలీట్ అవ్వవని గూగుల్ తెలిపింది.

# పెరుగుతున్న స్వైన్ ఫ్లూ కేసులు.. జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు..!

దేశంలోని అనేక ప్రాంతాల్లో రోజు రోజుకీ స్వైన్ ఫ్లూ కేసులు పెరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన సమాచారం ప్రకారం.. రాజస్థాన్‌లో ఇప్పటి వరకు 1911 స్వైన్ ఫ్లూ కేసులు నమోదవ్వగా 75 మంది ఈ వ్యాధి కారణంగా మరణించారు. అలాగే గుజరాత్‌లో 600 కేసులు నమోదవగా 24 మంది మ ృతి చెందారు. ఇక ఢిల్లీ ఈ విషయంలో 3వ స్థానంలో ఉంది. అక్కడ ఇప్పటి వరకు 532 స్వైన్ ఫ్లూ కేసులు నమోదయ్యాయి. కానీ ఢిల్లీలో స్వైన్ ఫ్లూ కారణంగా ఎవరూ మ ృతి చెందినట్లు తెలియలేదు. పంజాబ్‌లో 174 కేసులు 27 మరణాలు నమోదు కాగా, హర్యానాలో 372 కేసులు 8 మరణాలు, మహారాష్ట్రలో 82 కేసులు, 12 మరణాలు నమోదయ్యాయి.

దేశంలోని ఆయా రాష్ట్రాల్లో రోజు రోజుకీ స్వైన్ ఫ్లూ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుండగా, కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఆయా రాష్ట్రాలతో సమావేశాలు నిర్వహించింది. స్వైన్ ఫ్లూ వ్యాధి నిర్ధారణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని, హాస్పిటళ్లలో పడకలు అందుబాటులో ఉంచాలని సూచించింది. ఇక స్వైన్ ఫ్లూను రాకుండా చూసుకునేందుకు వైద్యులు కూడా పలు సూచనలు, జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. స్వైన్ ఫ్లూ (హెచ్1ఎన్1) వ్యాధి అంటు వ్యాధి. ఇది ఒకరి నుంచి ఒకరికి తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు లేదా స్పర్శ కారణంగా వస్తుంది. అలాగే స్వైన్ ఫ్లూ ఉన్నవారు తాకిన వస్తువులను ఇతరులు తాకితే వారికి ఆ వైరస్ వ్యాప్తి చెందుతుంది. ముఖ్యంగా టెలిఫోన్లు, సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, డోర్ హ్యాండిల్స్, డోర్ బెల్స్, పెన్నులు తదితర వస్తువులను వాడడంతోపాటు కరచాలనం వల్ల కూడా ఈ వైరస్ ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతుంది. కనుక ఈ విషయాల్లో ఎవరైనా జాగ్రత్త పాటించాలి. ఎదుటి వారు దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు తప్పనిసరిగా హ్యాండ్ కర్చీఫ్ లేదా మాస్క్‌తో ముక్కు, నోరును కవర్ చేసుకోవాలి. దగ్గు, జలుబు రెండు నుంచి మూడు రోజుల కన్నా ఎక్కువ సమయం పాటు ఉంటే కచ్చితంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. స్వైన్ ఫ్లూ వచ్చిన వారిలో జ్వరం, గొంతు నొప్పి, ఒళ్లునొప్పులు, దగ్గు, జలుబు, వాంతులు అవడం, వణుకు ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చేతులను తరచూ సబ్బు లేదా హ్యాండ్ వాష్‌తో శుభ్రం చేసుకోవాలి. ఇవి అందుబాటులో లేకపోతే కనీసం హ్యాండ్ శానిటైజర్లను అయినా వాడాలి. జన సమూహం ఎక్కువగా ఉన్న చోట కచ్చితంగా నోరు, ముక్కుకు అడ్డంగా మాస్క్ ధరించాలి. వీలైనంత వరకు వేడిగా ఉండే ఘన లేదా ద్రవ ఆహారాలను తీసుకోవాలి. నిత్యం తినే ఆహారంలో విటమిన్ సి ఉండేలా చూసుకోవాలి. శరీర రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారం తినాలి.

# కిశోర వికాసంపై అవగాహన: సీడీపీఓ శ్రీకాళ



నర్సీపట్నం : కిశోర వికాసం పై స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో గురువారం సీడీపీఓ శ్రీకళ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యుక్త వయసులో బాలికలు తీసుకోవలసిన జాగ్రత్తలు అప్రమత్తంగా ఉండడం వివక్షకు గురికావడం వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండడం ముఖ్యమని తెలియజేశారు. సమాసంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్, సోషల్ యాక్టివిస్ట్ సూర్య రత్నం, ఇతర రంగాల నుంచి స్వచ్ఛంద సంస్థ సభ్యులు హాజరై బాలికలకు అవగాహన కల్పించారు.ఇస్పిప్ ప్రసాద్, అంగన్వాడీ కార్యకర్త పాల్గొన్నారు.



విశాఖపట్నం జిల్లా పెందుర్తి నియోజకవర్గం పెందుర్తి మండలం విద్యాశాఖఅధికారి ఎస్. సాంబశివరావు పదవి విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొని సన్మానించిన పెందుర్తి ఎంపిపి రెడ్డి వరలక్ష్మి నారాయణరావు ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి శ్రీనివాసరావు, మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, మండల అధికారులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, ఉపాధ్యాయ సంఘాల యూనియన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఈనెల 4న భీమిలి సముద్రంలో మహోదయ స్నానాలు



భీమునిపట్నం : ఈ నెల 4వతేదీన సోమవారం ఉదయం 6.36 నిముషాలు నుంచి సాయంత్రం 5.38 నిమిషాలు వరకూ మహోదయ పుణ్యకాలం ఉంటుందని శ్రీ లక్ష్మి నరసింహస్వామి సింగల్ ట్రస్టి ఆలయ ప్రధాన అర్చకులు రొంపిచెర్ల శింగరాచార్యులు తెలిపారు. మహోదయ పుణ్యకాలం అమావాస్య ఆదివారం శ్రవణ నక్షత్రం ,పుష్యమాసం లో వచ్చేది సోమవారం అయితే మహోదయం అని అంటారని తెలిపారు. గోవు స్తనంల నుంచి వచ్చిన నదిని గోస్తనీనది అంటారని అన్నారు. ఆ నది భీమిలి తీర సముద్రమందు సంగమించినట్లు తెలిపారు. మహోదయ పుణ్య కాలం సందర్భంగా పుణ్య స్నానమాచరించి గోదానము,సాలిగ్రామదానము,నవదాన్యాది దానములు ఆచరించిన వారికీ కోటి జన్మముల పాపములను హరించునని కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉదయం సాయం సంధ్యలయందు సముద్ర స్నానమాచరించాలని కోరారు. గతంలో 2016లో వచ్చినపుడు అధికారులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాటులు చేసారని ఈ ఏడాది కూడా అధికారులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చెయాలని ఆయన కోరారు.

# గీత కార్మికులకు, రజకులకు చెక్కులు పంపిణీ చేసిన ఎంపీపీ



భీమునిపట్నం : మండల ప్రజా పరిషత్ కార్యాలయములో గురువారం సాయంత్రం ఆదరణ రెండు లో దరఖాస్తు చేసుకున్న రజకులకు గీత కార్మికులకు సుమారు వంద మంది కి మనిషికి పదివేలు చొప్పున భ భీమిలి మండల ఎం.పి.పి.యరబాల. క్రిష్ణవేణి అనీల్ ప్రసాద్, జెడ్పిటిసి సరగడ.అప్పారావులు అందజేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెనుకబడిన కులా ల్లో ఉన్న అన్ని వర్గాలకు న్యాయం చేసే విధంగా ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నారని ఆయనకు అందరూ ఋణపడి వుండాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో భీమిలి మండల టిడిపి అద్యక్షులు డి ఏ ఎన్ రాజు, విస్తరణ అదికారి ఆర్.వి.ఎల్.ఎన్. కుమార్, ఎం.పి.టి.సి లు అదికారులు పాల్గొన్నారు.

# జనసేన నాయకులు ప్రచార రథం ప్రారంభం



భీమునిపట్నం : తగరపు వలస లో వున్న భీమిలి నియోజకవర్గ కార్యాలయం వద్ద ఎల్.ఈ.డీ స్క్రీన్ తో చేసిన జనసేన ప్రచార రథం ను జనసేన నాయకులు అలీవర్ రాయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల గుర్తును,మేనిఫెస్ట్ ను పరిచయం చేయడానికి ఈ ప్రచారరథం ఉపయోగ పడుతున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు నాని, ఈశ్వర్రావు, సంతోష్, శ్రీకాంత్, గోవింద్ బాలు, గణేష్,రాజు,శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయరంగంలో పరిశోధనలు

# రైతులకు అందేలా కృషి చేయాలి

- ప్రతి రైతుకు కేస్ షీట్ నిర్వహించాలి
- విశాఖ జిల్లా కలెక్టర్ కె.భాస్కర్



విశాఖపట్నం: వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది కలిసి సమన్వయంతో పని చేసినపుడే రైతులకు మంచి సేవలు అందివ్వగలరని, మంచి ఫలితాలు సాధించగలరని జిల్లా కలెక్టరు కె.భాస్కర్ స్పష్టం చేశారు. గురువారం ఉదయం ఆత్మ గవర్నింగ్ బాడీ సమావేశం జిల్లా కలెక్టరు అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరములో నిర్వహించబడింది. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలలో జరుగుతున్న పరిశోధనలు రైతులకు చేరినపుడే ఉపయోగం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పరిశోధకు పని చేయాలన్నారు. అదే విధంగా ప్రాధమిక రంగంలోని శాఖలు నిర్వహించే వివిధ కార్యశాలలను గ్రామాలలోని వ్యవసాయ క్షేత్రాల దగ్గర రైతుల సమన్వయంతో నిర్వహిస్తే రైతులకు సమాచారం అందజేయబడటం వలన ఉప యోగపరంగా ఉంటుంద న్నారు. అక్కడ స్థానికంగా ఉండే ప్రోగ్రసివ్ రైతులకు తప్పకుండా అవకాశం కల్పించాలన్నారు. శిక్షణ పొందిన ప్రతి రైతుకు కేస్షీట్ ను తెరచి మూడు సంవత్సరముల పాటు నిర్వహించాలన్నారు. అందులో ఆ రైతులు పొందిన శిక్షణలు, భూసార పరీక్షలు, ఎరువులు, దిగుబడుల వివరాలు మొదలగు వాటిని పొందుపరచాలన్నారు. దీని వలన రైతులకు ప్రయోజనం ఉంటుందన్నారు. ప్రతి మూడు నెలలకు వాటిని సమీక్ష గావించాలన్నారు. రాబోయే మూడు సంవత్సరంలో ప్రతి ఎకరా డ్రిప్ వినియోగంలోకి రావాలని తద్వారా నీటి పొదుపు సాధ్యమవుతుందని మంచి ఉత్పత్తులు పొందవచ్చన్నారు. హార్టికల్చర్ ఉత్పత్తులకు మంచి డిమాండు ఉందన్నారు. జిల్లాలో పండే పంటలు ఇక్కడే వినియోగించబడే జిల్లా విశాఖపట్నం అన్నారు. కావున హార్టికల్చర్ పంటలను అధికంగా పెంచడానికి అధికారులు సిబ్బంది ప్రణాళిక ప్రకారం పని చేయాలన్నారు. ఇక్కడ వినియోగించబడే హార్టికల్చర్ ఉత్పత్తులన్నీ శత శాతం ఇక్కడే ఉత్పత్తి జరిగేలా కృషి చేయాలన్నారు. రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి, ప్రయోగాల ఉద్దేశ్యమని, ఈ విషయంలో సైంటిస్టులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జెసి-2 డా. ఎ.సిరి, జెడి వ్యవసాయం, ఎడి హార్టికల్చరల్ శైలజ, ఎ డి సెరికల్చరల్ పరమేశ్వరి, జె డి పిషరీస్, ఎడి పశుసంవర్ధక శాఖ కోటేశ్వరరావు, పలువురు సైంటిస్టులు రైతులు పాల్గొన్నారు.

# వాసుపల్లి బహిరంగ క్షమాపణ చెప్పాలి

## వైకాపా నగర యువజన విభాగం అధ్యక్షుడు కొండా రాజీవ్ గాంధీ



విశాఖపట్నం : తెలుగుదేశం పార్టీ అర్బన్ జిల్లా అధ్యక్షులు దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవ వాసుపల్లి గణేష్ కుమార్ గారు ఆయన క్యాంప్ ఆఫీస్ లో నిర్వహించినటువంటి ఒక సమావేశంలో ఒక ఛానల్ తో మాట్లాడుతూ వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీని, ఎమ్మెల్యేలను, ఎంపీలను కూడా అత్యంత హేయమైన అసభ్యపదజాలంతో దూషణలు చేయటం జరిగింది ఆయన మతిభ్రమించి మాట్లాడుతున్నారో ఆయనలో ఓటమి భయం పుట్టుకొచ్చి మాట్లాడుతున్నారో నాకైతే తెలియదు గాని మా పార్టీ ఎంపీలను, ఎమ్మెల్యేలను, అసెంబ్లీ కోఆర్డినేటర్లను, పార్టీని అత్యంత తీవ్రమైనటువంటి అసభ్య పదజాలంతో దూషించడాన్ని కొండా రాజీవ్ గాంధీ తీవ్రంగా ఖండించారు.మా పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావట్లేదని ఇళ్లల్లో కూర్చున్నారని విమర్శలు చేసిన వాసుపల్లి గణేష్ కుమార్ గారు మా ఎమ్మెల్యేలని సంతలో పశువుల్లా కొని మా ఎమ్మెల్యేలను మంత్రులుగా చేస్తే అది దుశ్శాసన సభ అవుతుంది కానీ శాసనసభ ఎందుకు అవుతుందని చెప్పి ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ ప్రశ్నించారు, మంత్రిగా చేసిన మా ఎమ్మెల్యేలు బర్తరఫ్ చేయమనండి మరుసటి రోజు పొద్దున్నే అసెంబ్లీ గేటు తెరవక ముందే ఎమ్మెల్యేలను తీసుకువచ్చి అసెంబ్లీ ముందు నిలబెడతానని జగన్ మోహన్ రెడ్డి గారు అన్న మాటను ఈ సందర్భంగా కొండా రాజీవ్ గాంధీ గుర్తు చేశారు. ప్రత్యేక హోదా కోసం పదవుల తునప్రాయంగా త్యాగం చేసిన పార్లమెంటు సభ్యులను అవమానకరంగా మాట్లాడ డాన్ని తీవ్రంగా ఖండించారు మా పార్టీ ఎమ్మెల్యేలు లూటీలు చేస్తున్నారని కబ్జాలు చేస్తున్నారని సత్యదూరమైన అటువంటి తప్పు డు కోతలు కోయటం చాలా బాధాకరమని నిజంగా వాసుపల్లి గణేష్ కుమార్ గారు ధైర్యముంటే ఈ నాలుగేళ్లలో దక్షిణ నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమాలపై అవినీతి కార్యకలాపాలు పైన అభివృద్ధి పైన బహిరంగ చర్చకు సిద్ధమా అని రాజీవ్ గాంధీ వాసుపల్లి గణేష్ కుమార్ గారికి సవాల్ విసిరారు దక్షిణ నియోజకవర్గం నడి బొడ్డున వాసుపల్లి గణేష్ కుమార్ గారు చెప్పిన ప్రాంతంలో చెప్పిన సమయానికి సిద్ధంగా ఉంటానని వాసుపల్లి గణేష్ కుమార్ గారి లో నిజాయితీ ఉంటే ఈ బహిరంగ సవాల్ స్వీకరించాలని కోరారు తద్వారా ప్రజలకు నిజానిజాలు తెలియాలి అని చెప్పి ఈ సందర్భంగా కొండా రాజీవ్గాంధీ డిమాండ్ చేశారు. ఒక విద్యావంతులుగా వాసుపల్లి గణేష్ కుమార్ తన స్థాయికి దిగజారి ఇటువంటి విమర్శలు చేయటం సిగ్గుచేటని మరొకసారి ఇలాగ దుర్భాష లతో తన నోటికి పని చెప్పకుండా ఐదేళ్లలో మిగిలిన రెండు నెలలు అయినా ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించే విధంగా వాసుపల్లి గణేష్ కుమార్ గారి కృషి చేయాలని దానికి ముందు మా ఎమ్మెల్యేలకు ఎంపీలకు పార్టీకి బహిరంగ క్షమాపణ చెప్పి తీరాలి అని ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ డిమాండ్ చేశారు.

పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా గురువులు ,మాజీ కార్పొరేటర్ గులిపిల్లి ఆనంద్ , దక్షిణ నియోజకవర్గం అధికార ప్రతినిధి గుత్తుల నాగభూషణం,వార్డ్ అధ్యక్షులు సూరాడ తాతారావు,నొల్లు పోతు స్వామి,దశిమంతుల మాణిక్యాలరావు, కండిపిల్లి నర్సింగరావు,చెట్టిబోయిన విజయ్,చిల్లా గోవింద్,21వ వార్డ్ యువజన అధ్యక్షుడు దిలీప్ తదితరులు పాల్గొన్నారు

## టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



జ్ఞానాపురం : 1984-85 సంవత్సరంలో ఇక్కడ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థినీ విద్యార్థులు ఒక సంఘంగా ఏర్పడి, మనం చదువుకున్న పాఠశాల పూర్వవిద్యార్థుల పిల్లలకు ఉచితంగా స్టడీ మెటిరియల్ ఇద్దామనే ఉద్దేశ్యంతో గురువారం 90 మంది పిల్లలకు స్టడీ మెటీరియల్ను అందజేసి మీరంతా పరీక్షలకు ఇష్టపడి చదవాలే గాని కష్టపడి చదవకూడదు అంటూ పూర్వవిద్యార్థుల ఏయూ రిజిస్ట్రార్ గంటా గోపాలకృష్ణ, నేవెల్ డిపోట్ సత్య శ్రీనివాసరావు, భీశెట్టి ఈశ్వరరావు, (పోలీసు డిపార్ట్మెంట్) 10వ తరగతి పిల్లలను ఉత్తేజపరిచారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా విద్యాశాఖాధికారి బి. లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ పిల్లలలో దాగివున్న సృజనాత్మకతను ఉపాధ్యాయులు గుర్తించిననాడే వారు అన్ని రంగాలలో రాణించి మేధావులుగా తయారు కాగలరని అన్నారు. ముఖ్య అతిధి ఏసీపీ కింజరాపు ప్రభాకర రావు మాట్లాడుతూ చక్కని క్రమశిక్షణతో కూడిన విద్యను పిల్లలు బాధ్యతగల పౌరులుగా తయారు కావాలని హితవు పలికారు. అనంతరం 10వ తరగతి చదువుతున్న 90 మంది పిల్లలకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేయడం జరిగింది.
ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల అధ్యక్షుడు డి. శివకుమార్ రెడ్డి, కార్యదర్శి పి. రమేష్, కోశాధికారి వై. శ్రీనివాసరావు, మళ్ల మోహనరావు, పాఠశాల ప్రిన్సిపాల్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

# ఎన్ సిసి ఉన్నతోద్యోగులకు ఘనంగా వీడ్కోలు



విశాఖపట్నం : విశాఖలోని ఎన్ సిసి కేంద్ర కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్గా విధులు నిర్వర్తించిన కల్నల్ ఎ.పి. రాయ్ (ఆర్మీ విభాగం), ఆఫీసు సూపరింటెండెంట్గా సేవలందించిన పి.సుశీల గురువారం ఉద్యోగ విరమణ చేశారు. కల్నల్ రాయ్ 33 సంవత్సరాలు పనిచేయగా, సూపరింటెండెంట్గా విధులు నిర్వర్తించిన పి.సుశీల 36 ఏళ్లపాటు ఎన్ సిసిలో సేవలందిం చారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో సిబ్బంది వీరి సేవలను కొనియాడారు. వారితో తమకున్న అనుబంధాన్ని ఒక్కొక్కరూ గుర్తు చేసుకున్నారు. ముందుగా ఉద్యోగ విరమణ చేసిన సూపరింటెండెంట్ సుశీలను సిబ్బంది సత్కరించారు. అడ్మిన్ అఫీసర్ రాయ్ శాలువా కప్పి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూడున్నర దశాబ్దాలపాటు ఎటువంటి వివాదాలకూ తావివ్వకుండా సేవలందించిన సుశీల సిబ్బందిని కుటుంబ సభ్యుల్లా భావించి, వారి అభిమానాన్ని చూరగొనడం గొప్ప విషయమన్నారు. ఆమె భావి జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం అడ్మిన్ ఆఫీసర్ రాయని సిబ్బంది సత్కరిం చారు. జ్ఞాపికను అందజేశారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రమేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఆంధ్రవిశ్వవిద్యాలయం చాన్సలర్ తన చాంబర్లో కల్నల్ రాయకి పుష్పగుచ్ఛం అందించి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అందించిన సేవలను ఏయూ వీసీ ఆచార్య నాగేశ్వరరావు ప్రస్తావించారు.



ఉద్యోగ విరమణ చేసిన పి.సుశీలను సత్కరిస్తున్న అడ్మినిస్ట్రేషన్ అధికారి కల్నల్ రాయ్, ఇతర సిబ్బంది.
ఉద్యోగ విరమణ చేసిన కల్నల్ రాయకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఏయూ వీసీ నాగేశ్వరరావు

# పరవాడ మండల అభివృద్ధికి జడ్పి నిదులు మంజూరు

## పరవాడ జడ్పిటిసి సభ్యుడు పైలా వెల్లడి



పరవాడ: మండలములోని పలు గ్రామాల్లో పనులు చేపట్టేందుకు గానూ జిల్లా పరిషత్ నిధులు మరియుఎన్ అర్ జిఎ నిదులు కలిపి మెత్తము మీద 1.67 కోట్లు మంజూరైనట్లు పరవాడ జడ్పిటిసి సభ్యులు పైల జగన్నాదరావు తెలిపారు. గురువారము అయన తన స్వగ్రహంలో విజయభాను ప్రతినిధితో మాట్లడుతూ అయా గ్రామాల వారీగా ఖర్చు చేసే నిదులూ వివరాలను అయన వెల్లడించారు. వాడచీపురుపల్లి పంచాయితీ పరిది ఊటగెడ్డపాలెంలోని సిసి రోడ్డు నిర్మాణానికి 5 లక్షలు, రావాడ ఎస్సీ కోలనీలో సిసి రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి 15 లక్షలు, వెన్నెలపాలెం ఎస్సీ కోలనీలో సిసి రోడ్డు నిర్మాణానికి 10 లక్షలు, గొర్లివానిపాలెం ఎస్సీ కోలనీలోని రిటైనింగ్ వాల్ మరియు కల్వర్టు నిర్మాణానికి 20 లక్షలు, పి.బోనంగి ఎస్సీ కోలనీలోని సిసి రోడ్డు నిర్మాణానికి 10 లక్షలు, తాణాం ఎస్సీ కోలనీలో సిసి కల్వర్టులు ప్లాట్ ఫారమ్ నిర్మాణానికి 10 లక్షలు, పెదముషిడివాడ మార్కెండీయా కోలనీలో సిసి రోడ్డు నిర్మాణానికి 15లక్షలు, పరవాడ ఎస్సీ కోలనీలో సిసి కాలువలు మరియు గోడ నిర్మాణానికి 15 లక్షలు, మెట్టపాలెం నుండి రాముడుగారి వీది వరకు మెటల్ రోడ్డు నిర్మాణానికి 10 లక్షలు చొప్పున మంజూరు అయ్యాయి అని పేర్కోన్నారు. అదే విధంగా తంతడి-తోటాడ అర్ అండ్ బి రోడ్డు నుంచి భరణికంశివారు కట్టవానిపాలెం వరకు బీ.టీ. రోడ్డు నిర్మాణానికి 50 లక్షలు మడకపాలెంలో అసంపూర్తిగా వున్న అంగన్ వాడి భవనానికి 4 లక్షలు, ఊటగెడ్డపాలెంలో అసంపూర్తిగా వున్న అంగన్వాడి భవనానికి 1.75 లక్షలు, జల్లెలపాలెంలో అసంపూర్తిగా వున్న అంగన్వాడి భవనము నిర్మాణానికి 1.75 లక్షలు మంజూరు అయ్యాయి అని తెలిపారు. పైన పేర్కోన్న నిదులు మెత్తము స్థానిక శాసన సభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి సహకారముతో మంజూరు అయ్యాయి అని జడ్పిటిసి సభ్యులు పైల జగన్నాదరావు తెలిపారు.

# ఏపీసీసీ కార్యదర్శిగా వి.ఎస్.కవి నియామకం



విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటి కార్యదర్శిగా శృంగారకవి వెంకటరమణ మూర్తి (వి.ఎస్.కవి) నియమితులయ్యారు. గురువారం విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో ఏఐసిసి రాష్ట్ర ఇంఛార్జి ఒమెన్ చాంద్ చేతులమీదుగా ఆయన తన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వి ఎస్ కవి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం పూర్తిస్థాయిలో కృషిచేస్తానని తెలిపారు. తనకు బాధ్యతాయుతమైన పదవిని అప్పగించిన కాంగ్రెస్ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపిసీసీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్. రఘువీరారెడ్డి, జనరల్ సెక్రటరీ ద్రోణంరాజు శ్రీనివాసరావు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

# నాలుగో వన్డేలో టీమిండియా పరాజయం

## బ్యాట్స్‌మెన్, బౌలర్లు విఫలం



హామిల్టన్: నాలుగో వన్డేలో టీమిండియా ఘోర పరాజయం పాలైంది. న్యూజిలాండ్ జట్టుపై ఇప్పటికే 3-0 తేడాతో సిరీస్ గెలిచిన టీమిండియా క్లీన్ స్వీప్ చేసే అవకాశం కోల్పోయింది. ఇటు బ్యాట్స్‌మెన్, అటు బౌలర్లు రాణించడంతో నాలుగో వన్డేలో కివీస్ జట్టు అలవోకగా విజయం సాధించింది. మరోవైపు 200వన్డే ఆడుతున్న రోహిత్ శర్మకు ఈ వన్డే చేదు అనుభవాన్ని మిగిల్చింది. గురువారం హామిల్టన్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా నిర్దేశించిన 93 పరుగుల లక్ష్యాన్ని కివీస్ అలవోకగా సాధించింది. కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 14.4 ఓవర్లలో మ్యాచ్‌ను ముగించింది. టీమిండియాపై కివీస్ జట్టు 8వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో 3-1 తేడాతో క్లీన్ స్వీప్ నుంచి కివీస్ తప్పించుకుంది. తొలుత టాస్ గెలిచిన కివీస్ బౌలింగ్ ఎంచుకుంది. అయితే టీమిండియాను 92 పరుగులకే ఆలౌట్ చేసిన అనంతరం బ్యాటింగ్‌కు దిగింది. ఈ క్రమంలో కివీస్ తొలి ఓవర్లోనే తొలి వికెట్ కోల్పోయింది. ఓపెనర్ మార్టిన్ గప్టిల్(14)ను భువి పెవిలియన్ చేర్చాడు. తర్వాత వన్‌డౌన్ బ్యాట్స్‌మెన్‌గా వచ్చిన విలియమ్సన్ కూడా భువి ఔట్ చేశాడు. ఈ దూకుడులో టీమిండియానే విజయం సాధించేలా కనిపించింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన రాస్ టేలర్(37), నికోల్స్(30) జోడీ రాణించి 54 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. ఇద్దరూ బౌండరీల వరద పారిస్తూ ఐదు ఓవర్లలో 42 పరుగులు చేశారు. దీంతో 15 ఓవర్లు కూడా పూర్తి చేయకుండానే రెండు వికెట్ల నష్టానికి కివీస్ 93 లక్ష్యాన్ని పూర్తి చేసింది. ఐదు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ట్రెంట్ బౌల్ట్ మ్యాన్ ఆఫ్ ది మ్యాన్‌గా నిలిచాడు.








Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com